

మంత్రి లోకేశ్ రాక రేపు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఆదివారం ఉదయం విశాఖ రానున్నారు. ఎనిమిదో తేదీన ప్రధాని రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం టీడీపీ జిల్లా కార్యాలయంలో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించి ప్రధాని సభకు జన సమీకరణపై చర్చిస్తారు. అనంతరం విజయవాడ వెళతారు. తిరిగి ఏడో తేదీ రాత్రి నగరానికి వచ్చి ఎనిమిదో తేదీన ఐటీ సదస్సులో పాల్గొంటారు. అనంతరం ప్రధాని సభకు హాజరవుతారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

- చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- విద్యా ప్రగతిపై ప్రతి సోమవారం సమీక్ష
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని, ఇందుకోసం ఇప్పటి నుంచి కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖకు సంబంధించి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంపై చక్కటి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులపై ఆయా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

బోధన విషయంలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులు, అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉపాధ్యాయులు ప్రతి రోజూ విద్యార్థుల పురోగతిని పరిశీలిస్తూ వుండాలని, మండల విద్యా శాఖ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు నిర్ణీత సమయంకన్నా ఐదు నిమిషాలు ముందుగానే పాఠశాలలో ఉండాలన్నారు. ప్రతి సోమవారం విద్యా ప్రగతిపై సమీక్ష వుంటుందని, లక్ష్య సాధనలో వెనుకబడిన వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఆగస్టు నుంచి ఇప్పటి వరకు పారామీటర్లు, ప్రగతి నివేదికలు సమర్పించాలన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని, ప్రతి ఒక్కరూ పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి ఆధార్ వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, తద్వారా డ్రాప్ అవుట్ అయిన వారిని గుర్తించగలమన్నారు. డ్రాప్ అవుట్‌లను గుర్తించే విషయంలో పనితీరును మరింత మెరుగు పరుచుకోవాలని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు, వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు, కిందిస్థాయి అధికారులు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఇప్పటికే సిలబస్ పూర్తి
- సబ్జెక్టుల వారీగా రివిజన్, ప్రాక్టీస్ టెస్టులు



కశింకోట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మరో 72 రోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు.. రివిజన్, ప్రాక్టీస్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. పునఃశ్చరణ తరగతుల నిర్వహణ ద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పరీక్షల్లో వారు కూడా ఉత్తీర్ణులయ్యేలా తర్ఫీదు ఇస్తున్నారు. పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో విమానాశ్రయం?

- అధికారులతో సమీక్ష సమావేశంలో సీఎం
- నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటుకు ప్రతిపాదన



నక్కపల్లిలో ఏపీఐఐసీ భూములు

అనకాపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుచేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ప్రతి జిల్లాలో విమానాశ్రయం ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల విస్తరణ, కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉండవల్లిలో సమీక్ష జరిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో భారీ స్టీల్ ప్లాంటు, బల్క్ డ్రగ్ పార్కు, అచ్యుతాపురం సమీపాన ఎన్‌టీపీసీ హైడ్రోజన్ ప్లాంటు ఏర్పాటు కానున్నందున విమానాశ్రయం అవసరం ఉందని ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. భోగాపురంలో విమానాశ్రయం పూర్తయితే విశాఖ విమానాశ్రయంలో కార్యకలాపాలు ఆగిపోయే అవకాశం ఉంది. అప్పుడు అనకాపల్లి జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు భోగాపురం వెళ్లాల్సి ఉంటుంది. అంత దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా అనకాపల్లి, కాకినాడ, విశాఖ పట్నం ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఏపీఐఐసీ ఆధీనంలో ఐదు వేల ఎకరాలు ఉంది. మిట్టల్ స్టీల్ ప్లాంటు, బల్క్ డ్రగ్ పార్కుకు కేటాయించగా మిగిలిన భూమిలో విమానాశ్రయం ఏర్పాటయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. విమానాశ్రయం ఏర్పాటు, స్థల సేకరణపై ఇంకా తమకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదని అనకాపల్లి జిల్లా అధికారులు చెబుతున్నారు.

ప్రధాని సభకు విస్తృత ఏర్పాట్లు



1.7 లక్షల మంది సమీకరణ



ఏయూ మైదానంలో ప్రధాని సభకు ఏర్పాట్లు

- విశాఖ జిల్లా నుంచి లక్షా 30 వేల మంది, అనకాపల్లి జిల్లా నుంచి 40,000 మంది
- విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్
- 22 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్: సీపీ
- సంపత్ వినాయక్ ఆలయం వద్ద నుంచి రోడ్‌షో
- అక్కడ నుంచి విద్యుత్ దీపాలతో అలంకరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల ఎనిమిదో తేదీన జరగనున్న ప్రధాని నరేంద్రమోదీ సభకు 1.7 లక్షల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విశాఖ నుంచి కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన సమీకరణ గురించి కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరం నుంచి 1.2 లక్షల మంది, నాలుగు గ్రామీణ మండలాల నుంచి పది వేల మంది, అనకాపల్లి జిల్లా ... మిగతా 8వ పేజీలో

రూ.2 లక్షల కోట్లతో పరిశ్రమలు

70 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- అనకాపల్లి జిల్లాపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల ప్రత్యేక శ్రద్ధ
- ‘మేక్ ఇన్ ఇండియా’ కింద ప్రోత్సాహం
- 8న ప్రధాని విశాఖ రాక.. ఘనస్వాగతానికి ఏర్పాట్లు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



అనకాపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ కారణంగా అనకాపల్లి జిల్లాలో సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8వ తేదీన విశాఖపట్నం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో రమేశ్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రధాని మోదీ తొలిసారి ఉమ్మడి విశాఖ జిల్లాకు వస్తున్నారని, ఆయనకు ఘనస్వాగతం పలుకుతామని చెప్పారు. ‘మేక్ ఇన్ ఇండియా’ ద్వారా అనకాపల్లి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రధాని ప్రోత్సాహం అందిస్తున్నారని చెప్పారు. ఆయా పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటైతే జిల్లాలో 70 వేల మందికి ప్రత్యక్షంగా/ పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ రమేశ్ తెలిపారు. విశాఖలో 8వ తేదీన ప్రధాని పాల్గొనే బహిరంగ సభకు అనకాపల్లి జిల్లా నుంచి 40 వేల మంది హాజరు కానున్నట్టు అంచనా వేస్తున్నామని, ఇందుకోసం 800 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. అచ్యుతాపురంలో ఎన్‌టీపీసీ, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని, ఇక్కడ ఏర్పాటు చేసే వేదికల వద్ద నుంచి స్థానికులు ప్రధానితో ముఖాముఖి మాట్లాడేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు.

హైవే భూముల్లో గ్రావెల్ తవ్వకాలు

సాగర మాల రింగు రోడ్డు స్థలంలో అక్రమార్కుల విధ్వంసం

- రాత్రిపూట తవ్వకాలు, తరలింపు
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఆగని దందా
- ఎమ్మెల్యే ఆదేశాలను అమలుచేయని అధికారులు



అమృతపురం రెవెన్యూ పరిధి సూరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరించిన భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గొయ్యి

సబ్బవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నప్పటికీ వైసీపీ జమానా తరహాలోనే సహజ వనరుల దోపిడీ కొనసాగుతున్నది. గత ప్రభుత్వంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపిన వ్యక్తులే ఇప్పుడు కూడా తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నాయకులను ‘మంచి చేసుకుని’ గ్రావెల్ తవ్వకాలు, రవాణా, అమ్మకాలు జరుపుతున్నారు.

అమృతపురం రెవెన్యూ పరిధి సూరెడ్డిపాలెం వద్ద అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి, సబ్బవరం-షీలానగర్ (సాగరమాల) రోడ్డు కలిసే ప్రాంతంలో డబుల్ ట్రంపెట్ నిర్మాణానికి 57 ఎకరాలను రైతుల నుంచి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సేకరించారు. సాగరమాల రోడ్డు పనుల్లో జాప్యం జరగడంతో ఆ భూముల్లో నుంచి గ్రావెల్ తవ్వుకుపోతున్నారు. జాతీయ రహదారి పక్కనే వున్న ప్రైవేటు స్థలంలో డంప్ చేశారు. కాగా పైడివాడ, పైడివాడఅగ్రహారం, అసకపల్లి, పల్లవానిపాలెం, గంగవరం, నంగినారపాడు గ్రామాల్లో కూడా రాత్రిపూట గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు.

అమలుకాని ఎమ్మెల్యే ఆదేశాలు

గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు నిఘా పెట్టి తవ్వకందారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పదేపదే చెబుతున్నప్పటికీ స్థానిక అధికారులు అమలు చేయడంలేదు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా ఆయన గ్రావెల్ అక్రమ తవ్వకాలకు సంబంధించి తీవ్ర హెచ్చరికలు చేశారు. అయినాసరే గ్రావెల్ తవ్వకాలు మాత్రం ఆగలేదు.

అనుమతులు ఇవ్వకపోవడంతోనే..

ఇళ్ల నిర్మాణంలో పునాదులు ఎత్తు చేయడానికి, పశువుల కల్లాల ఏర్పాటు, లోతట్టుగా వున్న ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి గ్రావెల్ లేదా మట్టి అవసరం. ఇటువంటి చిన్నపాటి అవసరాలకు సైతం గ్రావెల్ తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడం అక్రమార్కులకు కలిసొస్తున్నది. స్థానిక అవసరాలకు తాత్కాలిక అనుమతులు ఇస్తే, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

అందుబాటులోకి జల్లూరు వంతెన

- వాహనాల రాకపోకలకు అనుమతి
- సంక్రాంతిలోగా తారు రోడ్డు, రక్షణ గోడల నిర్మాణం
- ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఎంపీ సీఎం రమేశ్
- ప్రయాణికుల పదేళ్ల ఇక్కట్లకు తెర

అప్రోచ్ రోడ్ల మట్టి పనులు పూర్తి



వరహా నదిపై జల్లూరు వద్ద అప్రోచ్ రోడ్డు మట్టి పనులు పూర్తికావడంతో వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

కోటవురట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని జల్లూరు వద్ద వరహా నదిపై కొత్త వంతెన ఎట్టకేలకు ఏడేళ్లకు అందుబాటులోకి వచ్చింది. ప్రధాన వంతెన పనులు గత టీడీపీ హయాంలోనే పూర్తికాగా, వైసీపీ ఐదేళ్ల పాలనలో మిగిలిన పనుల్లో ఒక్కటి కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు మంజూరు చేయడంతో అప్రోచ్ రోడ్ల పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం మట్టి రోడ్డు నిర్మాణం పూర్తవడంతో వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతిస్తున్నారు.

మండలంలోని జల్లూరు వద్ద వరహా నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలస్థితికి చేరడంతో కొత్త వంతెన నిర్మాణానికి 2014లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. అయితే టెండర్ల ఖరారు ప్రక్రియ పూర్తయిన తరువాత టెండర్ దక్కని కాంట్రాక్టర్ కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో మూడేళ్లపాటు వంతెన నిర్మాణ పనులు మొదలుకాలేదు. తరువాత అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్న పాత్రుడు జోక్యం చేసుకుని, కోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకునేలా కృషి చేశారు. వంతెన నిర్మాణ పనులకు 2018 జనవరి 5వ తేదీన శంకుస్థాపన చేశారు. 2019 ఫిబ్రవరినాటికి రూ.2.3 కోట్ల మేర పనులు పూర్తికావడంతో ఆ మేరకు బిల్లులు మంజూరయ్యాయి. తదుపరి పనులు కొనసాగిస్తుండగా సాధారణ ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. దాదాపు మూడేళ్లపాటు వంతెన నిర్మాణం విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. తరువాత 2023 మార్చిలో నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పాత రేట్లకు పనులు చేయలేనని కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. అంతేకాక అగ్రిమెంట్ గడువు ముగిసినందున టెండర్ రద్దు చేయాలని ఆయన కోరారు. తరువాత నాటి వైసీపీ పాలకులు ... మిగతా 8వ పేజీలో

రేపే ‘ఆంధ్రజ్యోతి-ఏబీఎన్’ ముత్యాల ముగ్గుల పోటీలు

- అనకాపల్లి ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహణ



అనకాపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే ‘ఆంధ్రజ్యోతి’, ‘ఏబీఎన్’ యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. ‘ఆంధ్రజ్యోతి’, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు...గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)'కు అనకాపల్లిలోని ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం వేదిక కానున్నది. ఈ నెల ఐదో తేదీ... ఆదివారం ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.4 వేలు, రూ.3 వేలు బహుమతిగా అందించనున్నారు. ముగ్గు, రంగులు వగైరా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ (ఫోన్ నంబర్: 99854 11045) చేయించుకోవాలి. అనకాపల్లిలో నిర్వహించే పోటీలకు ‘కొణతాల సుబ్రహ్మణ్యం, అప్పలనరసమ్మ ట్రస్టు’ స్పాన్సర్‌గా వ్యవహరించనున్నది.

నేడు నేవీ విన్యాసాలు

ఆర్కే బీచ్‌లో ఆపరేషన్ డెమో

- ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- కుటుంబ సమేతంగా హాజరుకానున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



నేవీ విన్యాసాలను తిలకించేందుకు సిద్ధం చేసిన వేదిక

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం శనివారం సాయంత్రం రామకృష్ణా బీచ్‌లో సాహస విన్యాసాల ప్రదర్శన (ఆపరేషన్ డెమో) నిర్వహించనుంది. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఏటా డిసెంబరు 4న నేవీ డే నిర్వహించి, అదేరోజు సాయంత్రం బీచ్‌లో సాహస విన్యాసాలు ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి (2024) ఈ విన్యాసాలను ఒడిశా రాష్ట్రంలోని పూరీ బీచ్‌లో నిర్వహించగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరయ్యారు. విశాఖ ప్రజల కోసం నేవీ అధికారులు శనివారం ఆర్‌కే బీచ్‌లో ప్రదర్శన ఏర్పాటుచేశారు. దీనికి సీఎంను ఆహ్వానించారు. ఆయన శనివారం మధ్యాహ్నం 2.40 గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో బయలుదేరి 3.40 గంటలకు ... మిగతా 8వ పేజీలో

తూర్పుకాపు సంక్షేమ భవనాన్ని నిర్మిస్తాం : పీలా



పీలా గోవింద్‌ను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న సంఘం నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలోని టీడీపీ కార్యాలయంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణను తూర్పు కాపు సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం పీలా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో తూర్పుకాపు సంక్షేమ భవనాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పలకా రాము, పలకా సత్యనారాయణ, సకల గోవిందరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీరామదాసు గోవిందరావు, తలారి లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్పీడ్ స్కేటింగ్ పోటీలకు 'ప్రతిభ' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్య సిబ్బంది

సబ్బవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ప్రతిభ విద్యాలయం విద్యార్థులు అద్భుతంగా రాణించారు. ఇటీవల తిరుపతిలోని శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ రెండో చాంపియన్‌షిప్ పోటీలకు పదమూడు మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో తొమ్మిది మంది విద్యార్థులు ఈ నెల 18 నుంచి 21 వరకూ అస్సాంలోని గువాహటిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన ఎం.తిలక్, ఆర్‌ఎఫ్ కుమార్, ఎం.జానకీశ్వర్, నవీన్, ఎస్.కౌశల్, జిగ్నేష్, ఎం.రామవర్మ తదితరులను ప్రిన్సిపాల్ తదితరులు శుక్రవారం అభినందించారు.

చండీఘర్ విద్యుత్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఆందోళన



సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద నాయకులు నినాదాలు

పరవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చండీఘర్ విద్యుత్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడి సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో అత్యంత చౌకగా విద్యుత్ సరఫరా చేస్తున్న చండీఘర్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసి మోదీ ప్రభుత్వం కార్పొరేట్ యజమానులకు ఊడిగం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తక్షణమే ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.పి.నాయుడు, పి.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికులు ధర్నా



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఇక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదనంగా నియమించిన పదిహేను మంది కార్మికులకు ఎనిమిది నెలలుగా బకాయిపడిన వేతనాలు, అలాగే, క్లాప్ వాహనాల్లో పనిచేస్తున్న 28 మంది లోడర్స్‌కు బకాయిపడ్డ నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యర్రంశెట్టి శివకుమార్, నిమ్మకాయల అజయ్, సంతోష్, యర్రంశెట్టి ఓంశివ, నూకరాజులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

10న ప్రజాభిప్రాయ సేకరణపై వీడియో కాన్ఫరెన్స్

కొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ బృందావన్ కాలనీ ఎ-కన్వెన్షన్ హాలులో ఈ నెల 10న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ జరుగనుందని అనకాపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ జరగనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను, సూచనలను వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేయాలని కోరారు. దీనికోసం చీఫ్ జనరల్ మేనేజర్, రెగ్యులేటరీ ఆఫైర్స్, ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం కార్యాలయంలో లేదా విద్యుత్ డివిజనల్, సర్కిల్ కార్యాలయంలో పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

▸ సంస్మరణ సభలో వక్తలు



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భారతదేశానికి ప్రధానిగా మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని న్యూకాలనీలో గల సమావేశ మందిరంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ సంస్మరణసభ ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ హయాంలోనే అనేక చట్టాలు తీసుకు వచ్చారన్నారు. పదేళ్ల భారతదేశం ప్రపంచంలో ఐదవ ఆర్థికశక్తిగా అవతరించడంలో ఆయన పాత్ర అమోఘమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఆర్థికశాస్త్రంలో నిష్ణాతులు ప్రధానిగా పనిచేయడంతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలను భారతీయులు మర్చిపోలేరన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మలపురెడ్డి కోటేశ్వరరావు, నర్సీపట్నం కో-ఆర్డినేటర్ కె.చిన్నబాబు, అనకాపల్లి పార్లమెంట్ రీసెర్చ్ కో-ఆర్డినేటర్ బోయిన భానుమూర్తియాదవ్, కాళ్ల సత్యనారాయణ, బుద్ధ కిశోర్, పీఎస్ దత్తు, కత్తెర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

▸ దేశానికి అందించిన సేవలను శ్లాఘించిన ప్రముఖులు



నెహ్రూచౌక్‌లో పూలే చిత్రపటం వద్ద పలు సంఘాల ప్రతినిధుల నివాళి

అనకాపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతి, స్త్రీ విద్య కోసం పరితపించిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. ఆమె జయంతిని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి గాంధీనగరంలో జరిగిన ఈ వేడకల్లో యువ న్యాయవాది చిట్టా జయశ్రీ, మహిళా సంఘాల ప్రతినిధులు సుధా, న్యాయవాదులు ఐఆర్ గంగాధర్, అవినాష్ ఇళ్ల, ఓడిబోయిన రాంబాబు, బీసీ సంఘం నాయకులు పోలవరపు ఆనంద్, లాలం ప్రసాద్, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దూలం బూసిరాజు, బొట్టా చిన్ని యాదవ్, కుమారస్వామి, పోలారపు త్రినాథ్, రేబాక మధు, దాడి జగన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులకు శుక్రవారం ఘనంగా సత్కరించారు. తొలుత సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, అనకాపల్లి మండల ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, స్థానిక జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయినులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి ఎ.ఓంరామ్, టి.సంధ్యాకుమారి, ఎ.రమణ, సీహెచ్.రమణలతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుమ్మపాల: మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి తొలుత యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : తాళ్లపాలెంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకులంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ జి.గ్రేస్ పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లాల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు, వైస్ ప్రిన్సిపాల్ మెర్సీతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సబ్బవరం : సావిత్రీబాయి పూలే సేవలు ఆదర్శనీయమని స్థానిక గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ అన్నారు. గురుకులం, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ వీవీ సత్యరావు, కేజీబీవీ ఎస్‌వో మృదుల, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' తక్షణమే అమలు చేయాలని ఆందోళన



నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

తుమ్మపాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. బాబ్జి, కార్యదర్శి జి.ఫణేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలువురు విద్యార్థులతో కలిసి నెహ్రూచౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామనడం సరికాదన్నారు. దీనివల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, దివ్య, భవానీ తదితరులు పాల్గొన్నారు.

'108 సేవలు మరింత మెరుగుకు కృషి'



వాహనాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

అనకాపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయాల్లో అందరినీ ఆదుకునే సంజీవని 108 వాహనం సేవలను మరింత మెరుగుపర్చేందుకు వీలుగా ప్రభుత్వానికి నివేదిస్తామని ఆ విభాగం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ఎం.మురుగన్ బృందం పేర్కొంది. శుక్రవారం అనకాపల్లిలోని పలు ప్రాంతాల్లో 108, 104 వాహనాల పనితీరుపై సదరు బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం తరపున ఇక్కడికి విచ్చేసిన వీరు పలు కీలక అంశాలపై ఆయా ఉద్యోగులతో చర్చించారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు అహర్నిశలు ప్రయత్నిస్తామని, సేవలు మరింత మెరుగ్గా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా 108 విభాగం మేనేజర్ వీవీ త్రినాథరావు, 104 జిల్లా డీఎం అచ్యుతరావు, నాగేశ్వరరావు, శామ్యూల్, రవి తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

▸ తహసీల్దార్ బి.చిన్నికృష్ణ



అసకపల్లిలో రైతుల నుంచి అర్జీ స్వీకరిస్తున్నతహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కని వేదికలను తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సుల్లో మాట్లాడారు. భూ సమస్యలు ఉన్న రైతులెవ్వరూ ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా స్థానికంగానే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు, సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, గ్రామ పెద్దలు కరణం రాముసాయుడు, కర్రి బంగారునాయుడు, సర్వేయర్లు లోకేశ్, రాంబాబు, వీఆర్వో డి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎం.అలమండ సర్పంచ్ సస్పెన్షన్

దేవరాపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగంపై ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్నాథరావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తూ అదే గ్రామానికి చెందిన గొర్లె గోవింద గత ఏడాది జూన్ 26న డీపీవోకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు డీపీవో ఆదేశించారు. ఈ మేరకు ఆగస్టు 31వ తేదీన ఈవోపీఆర్డీ, సెప్టెంబరు 19న తహసీల్దార్ విచారణ చేశారు. వారి విచారణ నివేదిక ఆధారంగా సర్పంచ్ దాడి జగన్నాథరావుతోపాటు అప్పటి పంచాయతీ కార్యదర్శి పి.శివ ప్రసాదుల నుంచి డీపీవో సంజాయిషీ కోరారు. సర్పంచ్ నుంచి ఎటువంటి వివరణ రాకపోవడంతో గొర్లె గోవింద చేసిన ఆరోపణ నిజమేనని నిర్ధారిస్తూ సర్పంచ్ అధికారాల నుంచి మూడు నెలలుపాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఈ సమాచారాన్ని ఎంపీడీఓ, ఈవోపీఆర్డీ ఎం.అలమండ సచివాలయానికి పంపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జగన్నాథరావు మాట్లాడుతూ తనపై కొందరు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ఈ ఉత్తర్వులపై న్యాయపోరాటం చేస్తానన్నారు.

విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడిగా 'కాండ్రేగుల'



కొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడిగా కాండ్రేగుల వెంకటరమణ నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్‌గా ఠాకూర్ రామసింగ్ వ్యవహరిస్తున్న ఈ కమిటీలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇండస్ట్రీ, కామర్స్, అకడమిక్ రీసెర్చ్, కన్సూమర్స్, కార్మిక, ఎన్జీవో రంగాలకు చెందిన ప్రతినిధులు ఉంటారు.

మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



లాంగ్ జంప్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కైలాసగిరి రిజర్వు పోలీసు మైదానంలో శుక్రవారం మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. మహిళా పోలీసు అధికారుల పర్యవేక్షణలో తొలుత అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో తొలి రోజు హాజరైన 278 మందికి పరీక్షలు నిర్వహించారు. కాగా పురుషుల దేహదారుఢ్య పరీక్షలు నాలుగో రోజు కొనసాగాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్‌లు బాలసూర్యారావు టి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రామావతారంలో వెంకటేశ్వరస్వామి



కశింకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కశింకోట వేంకటేశ్వర ధ్యానమందిరంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారు శుక్రవారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అర్చకులు పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నేడు పాఠశాలల్లో అభివృద్ధిపై సదస్సు

పరవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాల్సిన అబి వృద్ధిపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఎంఈవో దివాకర్‌రావు తెలిపారు. పరవాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సు కొనసాగుతుందన్నారు. మండలంలో గల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని కోరారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీనగరం పశువైద్యశాల కార్యాలయంలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు అక్షయ సామాజిక సేవా సంఘం గౌరవాధ్యక్షులు ఎస్‌వీ కృష్ణారావు తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకల్లో భాగంగా కంటికి సంబంధించిన అన్ని వ్యాధులకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య బృందం పరీక్షలు జరుపుతారన్నారు. ఈ అవకాశాన్ని కంటిరోగులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

సమష్టి సహకారంతో అభివృద్ధి పనులు

పరవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు అంతా సహాయ సహకారాలు అందించాలని కలపాక సర్పంచ్ బొండా కనకారావు కోరారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. గత ఏడాది పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు గూరించి వివరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చించారు. పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి నాగభూషణరావు, వార్డు మెంబర్లు అక్కిరెడ్డి శ్రీను, తలుపులమ్మ, నాయకులు కొండలరావు, అశోక్, సప్ప సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

13న కొణతాల రామలింగస్వామి అవార్డుల ప్రదానం

తుమ్మపాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త కొణతాల రామలింగస్వామి అవార్డుల ప్రదానోత్సవాన్ని అంతా విజయవంతం చేయాలని కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీపార్వతి శుక్రవారం కోరారు. ఈ నెల 13న అనకాపల్లి పట్టణంలోని ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఐదు రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయ రంగం నుంచి విజయనగరం జిల్లాకు చెందిన డాక్టర్ బొంతల కోటి శంకరరావు, సంఘసేవా రంగానికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సి.గౌతమ్‌కుమార్, విశాఖపట్నానికి చెందిన ఎల్లేటి మమత, ఒడిశా రాష్ట్రానికి చెందిన నాగోలు ఆదేష్, తెలంగాణకు చెందిన కొత్తూరు సుర్వి రాజశేఖర్‌లు ఎన్నికయ్యారన్నారు. అలాగే ఉత్తమ విద్యార్థిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన రావాడ సాయి మోహినిమానసను ఎంపిక చేసినట్టు చెప్పారు.

ఎంజీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమారాధన రేపు

అనకాపల్లి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో ఎంజీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమారాధన జరగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కుటుంబ సభ్యులతో హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం, కార్యదర్శి దాడి శివరామకృష్ణ, కో-ఆర్డినేటర్ కేఎన్‌వీ సత్యనారాయణ, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

























ప్రకటన

నా క్లయింటు అయిన అనకాపల్లి, గవరపాలెం, వేగి గౌరీసునాయుడు గారి వీధి వా॥లు వేగి లేటు పెద అప్పలనాయుడు గారి కు॥ వేగి గౌరీశ్వరరావు గారు మాకిచ్చిన భోగట్టాపై యావత్ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా.

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, కాడి శివారు రాజులపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 95/4లో చేరిన య.0-05 ట్లు ఆస్తికి సంబంధించిన నా క్లయింటు కాలాతా సబ్బవరం సబురి వారి కార్యాలయంలో తే.31-12-1986 దిన, నా క్లయింటు పేరు దస్తావేజు నెం.498/1986గా రిజిస్ట్రీ కాబడిన ఒరిజినల్ క్రయ దస్తావేజు ఇటీవల కాలంలో పోయినది. కావున లోకులకు ఎవ్వరికైనా సదరు దస్తావేజు దొరికినచో మా కార్యాలయమునకు గానీ, లేదా నా క్లయింటుకు గారికి అప్పగించవలసినదిగా నా క్లయింట్లు కోరుచున్నారు.

యం. జయరాం, బి.యస్.వి. రాజగోపాల్
న్యాయవాదులు
M.S.S.R. కాంప్లెక్స్, బాలకృష్ణ బస్ స్టాప్ ఎదురుగా, మెయిన్‌రోడ్, అనకాపల్లి.

ఉత్సాహంగా కేఆర్‌కే కప్ క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాంకీ

తుమ్మపాల/కొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో కేఆర్‌కే క్రికెట్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. తొలుత ఈ పోటీలను జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో ఏఎంఎఎల్ కాలేజీ జంక్షన్ టీమ్, గాంధీనగరం, కశింకోట, తుమ్మపాల, కొప్పాక రాజు, ఆవ టీమ్‌లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో ఏఎంఎల్ జంక్షన్ టీమ్, కొప్పాక రాజు టీమ్‌ల మధ్య శనివారం ఫైనల్స్ జరగనున్నాయి. ముగింపోత్సవం అనంతరం కొణతాల రామకృష్ణ విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గొంతిన అప్పారావు, భర్నికాన రాము, ఆళ్ళ రామచంద్రరావు, పీలా నాగశ్రీను, చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




















రైతులకు అందుబాటులో ఉండండి

▸▸ అధికారులకు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచన



డివిజన్‌లోని వ్యవసాయాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మోహన్‌రావు

ఎలమంచిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వ్యవసాయరంగం అభివృద్ధికి తోడ్పాటునందించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు సూచించారు. ఎలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రబీ సీజన్‌లో రైతులంతా అధిక దిగుబడులు సాధించేందుకు అవలంభించాల్సిన సూచనలు, సలహాలను వ్యవసాయ సిబ్బంది అందించాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. పీఎం కిశాన్ పథకంపై మరిన్ని సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సుమంత, నాలుగు మండలాల ఏవోలు మోహన్‌రావు, శంకర్, గోవింద్, సౌజన్య, ఏఈవో దేముడు తదితరులు పాల్గొన్నారు.

'విద్యా ప్రమాణాల మెరుగుకు సమష్టిగా కృషి చేయండి'



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు చొరవ చూపాలని ఎంఈవోలు డి.వేణుగోపాలరావు, బుద్ద శివనాయుడు సూచించారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎంలు, పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. విద్యా ప్రమాణాలు, ఉత్తీర్ణత శాతం పెంపునకు సమష్టిగా కృషి చేయాలన్నారు. శిక్షకులు రామచంద్రరావు, ఎస్‌వీసిహెచ్.సత్యనారాయణ, సాగంటి వెంకటరమణలు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

22ఎ, ఫ్రీహోల్డ్ భూ సమస్యలపై ఫిర్యాదులు నిరాకరణ

అచ్యుతాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : దొప్పెర్లలో శుక్రవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రభాకరరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఇదో చక్కని అవకాశంగా పేర్కొన్నారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఇదిలావుంటే, ఈ పంచాయతీ పరిధిలో వైసీపీ ప్రభుత్వంలో మార్పిడి చేసిన 22ఎ, ఫ్రీహోల్డ్ భూములపై ఆర్జీలు తీసుకోటానికి అధికారులు అంగీకరించలే దు. దీనిపై తాము ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయా అర్జీలు సమర్పించేందుకు వచ్చినవారు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నునపర్తిలో గ్రామ కంఠం స్థలంపై వివాదం

▸▸ ఆ భూమిలో ఇటీవల షెడ్లు వేసేందుకు పరవాడ మండలం వెన్నెలపాలేనికి చెందిన వ్యక్తి ప్రయత్నం

▸▸ అడ్డుకున్న టీడీపీ శ్రేణులు ▸▸ సదరు వ్యక్తి ఇటీవల వైసీపీ నుంచి బీజేపీలో చేరినవారిని ఆశ్రయం

▸▸ ఇరువర్గాల మధ్య వాగ్వాదాలతో పోలీసులకు ఫిర్యాదులు ▸▸ టీడీపీకి చెందిన తొమ్మిది మందిపైనే పోలీసులు కేసు నమోదు



సదరు స్థలం వద్ద ఆందోళన చేస్తున్న నునపర్తి గ్రామస్థులు (ఫైల్)

అచ్యుతాపురం, సనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నునపర్తిలో గ్రామ కంఠం స్థలంపై వివాదం నెలకొంది. గ్రామ కంఠం స్థలం ఆక్రమణ కుదరదని టీడీపీ శేణులు, ఆ స్థలం తమదేనంటూ వైసీపీ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన నాయకులు వాగ్వాదానికి దిగారు. అయితే టీడీపీ వర్గీయులైన తొమ్మిది మందిపై మాత్రమే గత నెల 29న కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..

అచ్యుతాపురం మండలంలోని నునపర్తి (పరవాడ బోర్డర్) గ్రామ కంఠం సర్వే నంబరు 93లో గల భూమిలో పరవాడ మండలం వెన్నెల పాలేనికి చెందిన వ్యక్తి షెడ్లు వేసేందుకు సిద్ధమయ్యాడు. దీనిని టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. ఈ అంశాన్ని ఇటీవల వైసీపీ నుంచి బీజేపీలో చేరిన నాయకుల దృష్టికి సదరు వ్యక్తి తీసుకు వెళ్లాడు. వాగ్వాదంపై టీడీపీ శ్రేణులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈవోపీఆర్‌డీ శ్రీరాములనాయుడు డిసెంబరు 12న విచారణకు నునపర్తి వెళ్లారు. ఇరువర్గాల వారు ఆందోళన చేయడంతో ఉన్నతాధికారులతో చెప్పి చర్యలు తీసుకుంటామని వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఈ స్థలం గ్రామ కంఠానికి చెందినదని, ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని డిసెంబరు 13న పంచాయతీ కార్యదర్శి నోటీసును జారీ చేశారు. అదే నెల 16న ఎంపీడీవో ప్రభాకరరావు నునపర్తి వెళ్లి విచారణ జరిపారు. అప్పుడు కూడా రెండువర్గాల వారు వాగ్వాదాలకు దిగారు. దీంతో సమస్యను సమారస్యంగా పరిష్కరిస్తామని అంతవరకు ఎవరూ నిర్మాణాలు చేయవద్దని చెప్పి వెళ్లిపోయారు. అయితే 29వ తేదీ ఆదివారం కావడంతో అధికారులెవరూ రారన్న ఉద్దేశంలో ఆ స్థలంలో రేకుల షెడ్డు వేయడానికి ప్రయత్నించగా, టీడీపీ శ్రేణులతో పాటు గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. టీడీపీ శ్రేణులు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తదితరల దృష్టికి తీసుకు వెళ్లారు. కాగా, గత నెల 29న పోలీసులు తొమ్మిది మంది టీడీపీ శ్రేణులపై కేసు నమోదు చేశారు.

ఇదిలావుంటే, గతంలో వైసీపీ నుంచి బీజేపీకి వచ్చిన నాయకులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను తప్పుదోవ పట్టించి తమపై కేసులు నమోదు చేయించారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. కేవలం గ్రామ కంఠాన్ని కాపాడడం కోసం తాము పోరాడుతున్నామని, ప్రశ్నిస్తే పోలీసులు కేసులు పెడతారా..? అని వారంతా వాపోతున్నారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయిస్తామని టీడీపీ నాయకులు చెపుతున్నారు.

ఒడిశా రాష్ట్రానికి రైతులు విజ్ఞాన యాత్ర

రాంబిల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 25 మంది రైతులను ఒడిశా రాష్ట్రానికి విజ్ఞాన యాత్రకు తీసుకు వెళ్లినట్టు వెంకటాపురం కృషి విజ్ఞాన కేంద్రం సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వానా ప్రసాదరావు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం కటక్‌లోని జాతీయ వరి పరిశోధనా స్థానంలో కొత్తవరి వంగడాల గురించి, వరిలో జీవన ఎరువుల వాడకం గురించి రైతులకు తెలియజేశారన్నారు. అలాగే, భువనేశ్వర్‌లోని జాతీయ ఉద్యాన ప్రయోగ కేంద్రంలో పండ్ల తోటల్లోనే కాకుండా కూరగాయలలో కూడా అంట్లు కట్టే విధానాన్ని రైతులు నేర్చుకున్నట్టు చెప్పారు. ఉద్యాన పంటలులో అంతర పంటలు సాగు విధానాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా జాతీయ దుంపజాతి పంటల పరిశోధనా స్థానంలో చిలగడ దుంపల సాగు తదితర అంశాలను వివరించారున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి తులసీమణి, భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా విద్యా ఉద్యమానికి సావిత్రీబాయి పూలే పునాది'



పూలే చిత్రపటం వద్ద యూటీఎఫ్ ప్రతినిధుల నివాళి

అచ్యుతాపురం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళా విద్యా ఉద్యమానికి పునాది వేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అన్నారు. మండల కేంద్రం అచ్యుతాపురంలో గల ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తొలి మహిళా గురువుగా, సామాజిక సంస్కర్తగా, మహిళా విద్యా విధానం కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన వనితగా ఆమె ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మదెల్ల నానాజీ, కె.సుభాషిణీ దేవి, మహిమారావు, సూర్యలక్ష్మి, అరుణ, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, పాఠశాల ప్రిన్సిపాల్ మధు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : పంచదార్ల హైస్కూల్‌ల ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జయింట్ సెక్రటరీ సిహెచ్. మంగతయారు, ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

ఇంటర్ విద్యార్థులకు

నేటి నుంచి మధ్యాహ్న భోజనం

ఎలమంచిలి జూనియర్ కళాశాలలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న కలెక్టర్



ఎలమంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఎలమంచిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ఆయా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో శనివారం నుంచి ఎలమంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న సుమారు 653 మంది విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కడుపునిండా అందనుంది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఇక్కడ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఏటికొప్పాకలో పూరిల్లు దగ్ధం

ఎలమంచిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో పంచదార్ల రమణకు చెందిన పూరిల్లు శుక్రవారం దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసేలోపే పూర్తి కాలిపోయిందని బాధితుడు బాధిత కుటుంబం వాపోతోంది. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి గ్రామ కార్యదర్శి వారిని పరామర్శించారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా బొద్దపు శివ



ఎలమంచిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎలమంచిలి పట్టణ అధ్యక్షుడిగా బొద్దపు శివ ఎన్నికైనట్టు ఓబీసీ ప్రధాన కార్యదర్శి పిట్టా దాసుబాబు శుక్రవారం తెలిపారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు శివను ఎన్నికల అధికారి ఉడా రమేష్ సమక్షంలో ఎన్నుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీవీఎస్ వర్మ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుర్రాల నగేష్, కో-కన్వీనర్ నక్కా శివ, పప్పు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



బోదిగల్లంలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

నక్కపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్‌బీ అగ్రహారం, పెదబోదిగల్లం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ రెండు గ్రామాల్లో రైతుల నుంచి సుమారు 24 భూ సంబంధిత దరఖాస్తులు, ఫిర్యాదులను తహసీల్దార్ స్వీకరించారు. ఈ సందర్భంగా రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. దాదాపు 15 రోజుల్లోగా సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెదబోదిగల్లం సర్పంచ్ ముస్నీషాబేగం, డీటీ అన్నాజీరావు, ఆర్ఐ కన్నబాబు పా

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



పూలే చిత్రపటానికి పూలమాల వేసిన డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధర్మవరం అగ్రహారం జడ్పీహెచ్ పాఠశాలలో డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు, ఇన్‌చార్జి ఎంఈవో సత్తిబాబు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సంఘ సంస్కర్త పూలే ఆడ పిల్లల చదువు కోసం నిరంతం పాటుపడ్డారని, అసమానతలపై అలు పెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. అలాగే పెదగుమ్ములూరు పాఠశాలలో ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుధాకర్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్లలో...



పాములవాక పాఠశాలలో పూలేకు నివాళులర్పిస్తున్న టీచర్లు

కోటవురట: మండల కేంద్రంతో పాటు పాములవాక, జల్లూరు గ్రామాల్లో పూలే జయంతి నిర్వహించారు. పాములవాక జడ్పీహెచ్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శనీయమన్నారు. బాలికల విద్య కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ధైర్యశాలి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో కోటవురట్ల హెచ్‌ఎం యేసుదాసు, కేజీబీవీ ఎస్‌వో సరితాదేవీ. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పర్యాటక కేంద్రంగా సరుగుడు జలపాతం'

నాతవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సరుగుడు జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ చెప్పరు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణతో కలసి శుక్రవారం జలపాతానికి వెళ్లే రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం తదితర దూరప్రాంతాల ఉంచి ఈ జలపాతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నదన్నారు. అందువల్ల పర్యాటకుల బస్సుల కోసం పార్కింగ్, రోడ్డు తదితర సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. పర్యాటకులకు డ్రెసింగ్ రూమ్‌లు, కాటేజీల నిర్మాణం, సిమ్మెంట్ మెట్ల ఏర్పాటు తదితర సౌకర్యాలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపాదనలు తయారు చేయించారని ఆయన చెప్పారు.

తహసీల్దార్ దురుసుతనం కలచివేసింది

▸▸ గ్రామ సచివాలయ ఉద్యోగుల ఆవేదన

▸▸ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాయకరావుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌పై విచారణలో భాగంగా సచివాలయ ఉద్యోగిపై మండల తహసీల్దారు దురుసుగా మాట్లాడడం తమను ఎంతగానో కలచివేసిందని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు సచివాలయ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని సచివాలయాల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవో ఎ.జయప్రకాశరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీలో అవకతవకలపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకునే కార్యక్రమంలో భాగంగా గురువారం సత్యవరం వచ్చిన తహసీల్దారు సత్యనారాయణ ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయరాజుపై మూడు ఐవీఆర్ఎస్ కంప్లయింట్లు వచ్చిన సందర్భంగా అత్యంత దురుసుగా, అమానవీయంగా ప్రవర్తించడం తమను కలచివేసిందన్నారు. దీన్ని ఖండిస్తున్నామని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

దీనిపై తహసీల్దార్ జి.సత్యనారాయణను వివరణ కోరగా ఐవీఆర్ఎఫ్‌లో మూడు కంప్లయింట్లు వచ్చిన సచివాలయ ఉద్యోగి వీడియో ఫ్రేమ్‌కు దూరంగా ఉండటాన్ని గుర్తించి చేయిపట్టుకుని ఫ్రేమ్‌లోకి రావాలని చెప్పానని, దీన్ని అతడు దురుసుగా ప్రవర్తించడం అని అనుకుని ఉండవచ్చని ఆయన చెప్పారు.

గజ వాహనంపై గోపాలుడు



మాఢవీధుల్లో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో శుక్రవారం గజ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. కొండపైన, కింద వున్న ఆలయాల్లో ఉదయం ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, భాగవతం సాయిగోపాలాచార్యులు, నండూరి రాజగోపాలచర్యులు, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని గజ వాహనంపైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, సభ్యులు పవన్ కుమార్, జ్ఞాన ప్రమోద్, తాతాజీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

'నరసింహుడు'గా పాండురంగడు



పాయకరావుపేట, జనవరి 3: స్థానిక పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు నరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో పాండురంగస్వామికి సుప్రభాతసేవ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాండురంగ స్వామిని నరసింహస్వామిగా అలంకరించారు. దేవస్థానం ఈవో కె.దివ్యజ్యోతి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రధానార్చకులు కృష్ణస్వామి మాట్లాడుతూ భక్తుడైన ప్రహ్లాదుని కాపాడేందుకు శ్రీమహావిష్ణువు నరసింహావతారమెత్తి ప్రహ్లాదుని తండ్రి హిరణ్యకశిపుని సంహరించినట్టు పురాణాలు చెబుతున్నాయన్నారు.

బాబోయ్.. చలి చంపేస్తోంది!



చలి మంట కాస్తున్న ప్రజలు

నక్కపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజుల నుంచి చలి చంపేస్తోంది. రాత్రి 8 నుంచి ఉదయం 7 గంటల వరకూ మండలంలోని పలు గ్రామాల్లో విపరీతంగా మంచు కురుస్తోంది. అదే సమయంలో చలి తీవ్రత కూడా బాగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి పులి పంజా విసురుతోంది. రాత్రి నుంచి ఉదయం వరకూ స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. పొద్దుపోతే పిల్లల నుంచి పెద్దల వరకూ చలి మంటలు వేసుకుంటున్న దృశ్యాలు పలు చోట్ల కనిపిస్తున్నాయి.

గ్రామ సింహాలు స్వైర విహారం



మంగవరం రోడ్డుపై గుంపుగా తిరుగుతున్న కుక్కలు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటిని చూసి పాదచారులు, వాహన చోదకులు హడలిపోతున్నారు. మంగవరం, సత్యవరం, అరట్లకోట, గోపాలపట్నం, పెదరాంభద్రపురం తదితర గ్మాఅల్లో రోడ్లపై నిత్యం తిరుగుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ద్విచక్ర వాహన చోదకులపైకి ఎగబడుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.














ఉత్సాహంగా కేఆర్‌కే కప్ క్రికెట్ పోటీలు




క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాంకీ

తుమ్మపాల/కొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదినం సందర్భంగా అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో కేఆర్‌కే క్రికెట్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. తొలుత ఈ పోటీలను జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో ఏఎంఎఎల్ కాలేజీ జంక్షన్ టీమ్, గాంధీనగరం, కశింకోట, తుమ్మపాల, కొప్పాక రాజు, ఆవ టీమ్‌లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో ఏఎంఎల్ జంక్షన్ టీమ్, కొప్పాక రాజు టీమ్‌ల మధ్య శనివారం ఫైనల్స్ జరగనున్నాయి. ముగింపోత్సవం అనంతరం కొణతాల రామకృష్ణ విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గొంతిన అప్పారావు, భర్నికాన రాము, ఆళ్ళ రామచంద్రరావు, పీలా నాగశ్రీను, చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

















సీలేరు క్లస్టర్-1కు ఎంపికైన వారికి ధ్రువ పత్రాలిస్తున్న అధికారులు


చింతపల్లిలో ధ్రువీకరణ పత్రమిస్తున్న ప్రిసైడింగ్ అధికారి పండన్న

ప్రశాంతంగా పెసా కమిటీ ఎన్నికలు

- అన్నిచోట్లా ఏకగ్రీవం
- కోరంలేక కొన్ని కమిటీల ఎన్నికలు వాయిదా

సీలేరు జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీల పరిధిలో క్లస్టర్ వన్, క్లస్టర్- 2లలో శుక్రవారం నిర్వహించిన పెసా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు నోడల్ అధికారి డీవీ కాళేశ్వర రావు తెలిపారు. క్లస్టర్ వన్ లో కార్యదర్శిగా కిముడు సిరుపతి, ఉపాధ్యక్షుడిగా కిల్లోమనోజ్‌కుమా ర్‌ను, సెక్టర్ 2 లో కార్యదర్శిగా సీసా ధను, ఉపాధ్యక్షుడిగా గొళ్ళోరి స్వప్న ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నోడల్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, వైస్ సర్పంచ్ వల్లీప్రసాద్, కార్యదర్శి పరశురామ్, కూటమి నాయకులు చిటికెల రాము, బాలకృష్ణ, సన్యాసిరావు, మింది, కారే అప్పలరాజు, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొయ్యూరులో 26 కమిటీలకు ఎన్నికలు పూర్తి

కొయ్యూరు: మండలంలో 38 కేంద్రాల్లో నిర్వహించిన పెసా కమిటీ ఎన్నికల్లో 26 వాటిల్లో సజావుగా సాగగా, మరో 12 కేంద్రాలలో కోరం లేక వాయిదా వేసినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మండలంలోని 33 పంచాయతీలలో జనాభా ప్రాతి పదికన 47 పెసా కమిటీలు నిర్వహించాల్సి ఉంది. వీటిలో శుక్రవారం 38 కేంద్రాలోకల కమిటీ ఎన్నికలకు ఏర్పాటు చేశారు. వీటిలో 12 కేంద్రాలలో పంచాయతీ జనాభాలో 1/3 వంతు హాజరు కాకపోవటంతో ఆయా ఎన్నికలు వాయిదా పడ్డాయి. మిగిలిన కేంద్రాల్లో ఎన్నికైన ప్రతినిధులకు రిటర్నింగ్ అధికారులు ధ్రువ పత్రాలు అందించారు.

కోరంలేక ఏడు చోట్ల ఎన్నికలు వాయిదా

చింతపల్లి: మండలంలో పేసా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం తొలిరోజు 30గ్రామ సభలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేయగా 23చోట్ల పూర్తయ్యాయి. కొమ్మంగి, చౌడుపల్లి, కిటుముల, ఎ.శనివారం, పెదబరడ, గొందిపాకలు, రోలంగి గ్రామ సభల్లో మూ డో వంతు ఓటర్లు హాజరుకానందున ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికలను వాయిదావేశారు. 18 గ్రామ సభల్లో ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. చింతపల్లి, అన్నవరం, అడ్డాలవీధి, పశువులబంద, వంగసార గ్రామ సభల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శికి ఇద్దరు చొప్పున పోటీపడ్డారు. దీంతో ప్రిసైడింగ్ అధికారులు చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. శనివారం 29 గ్రామ సభలకు ఎన్నికలు నిర్వహిస్తామని, వాయిదాపడిన ఏడు చోట్ల ఈనెల 7తేదీలోగా ఎన్నికలు పూర్తి చేస్తామని ఎన్నికల అధికారి, ఏడీఏ కంటా జాహ్నవి తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, తహసీల్దార్ రవికుమార్, వైస్ ఎంపీపీ వెంగళరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దురియా పుష్పలత, కూటమి నాయకులు రీమల ఆనందరావు, దూరి రామకృష్ణ, పెదిరెడ్ల బేతాళుడు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో వనభంగి, గోమంగి, కిముడుపల్లి తదితర పంచాయతీల్లో పెసా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్ష, కార్యదర్శుల పదవులు ఏకగ్రీవమైనట్టు అధికారులు తెలిపారు. వనభంగిలో ఉపాధ్యక్షుడి పి.విష్ణుమూర్తి, కార్యదర్శిగా జె.మోహనరావు, గోమంగిలో ఉపాధ్యక్షుడిగా కె. రాధాకృష్ణ, కార్యదర్శిగా జె. సునీనిల్‌కుమార్, కిముడుపల్లిలో ఉపాధ్యక్షుడిగా అంగనైని ఆనంద్, కార్యదర్శిగా బర్లు సింహాచలం ఎంపికయ్యారు.

గ్రామాల అభివృద్ధికి పెసా కమిటీలు

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాలు సమగ్ర నివేదికతో అభివృద్ధి చెందడానికి పెసా కమిటీ ఎన్నికలు దోహదపడతాయని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. మండలంలోని కురిడి పంచాయతీ జంగడివలసలో పెసా కమిటీ ఎన్నికలను అధికారులు నిర్వహించారు. ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి అధికారులు, టీడీపీ నాయకులు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లచ్చి, మాజీ ఎంపీపీ దన్నేరావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని 23 పంచాయతీల పరిధిలో 44 చోట్ల పెసా ఎన్నికలు జరగాల్సి ఉండగా 40 చోట్ల పూర్తయినట్టు మండల ఎన్నికల ప్రత్యేక అధికారి స్వర్ణలత తెలిపారు. కించాయిపుట్టు, దారెల, పనసపుట్టు, జోలాపుట్టు గ్రామాల్లో ఎన్నికలు వాయిదా వేసినట్టు చెప్పారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వారికి ధ్రువ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీసాయిహర్ష, తహసిల్దార్ నర్సమ్మ, ఎంఈవో కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.


ఎంపికైన పాడేరు పెసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు


ముంచంగిపుట్టు మండలంలో ఎన్నికైన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్న దృశ్యం


వనభంగిలో...

14 చోట్ల ఏకగ్రీవం

పాడేరురూరల్: మండల పరధిలో 16 చోట్ల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 14 చోట్ల ఏకగ్రీవమయ్యాయని, 2 చోట్ల కోరం లేక ఎన్నికలు నిలిచిపోయినట్టు స్థానిక ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. పాడేరు, సుండ్రుపుట్టు, డి.గొందూరు, గుర్రంపనుకు, గొండెలి, లింగాపుట్టు, జి.ముంచంగిపుట్టు, కొత్తపల్లి, లగిశపల్లి, పార్వతీపురం, మోదాపల్లి, గుర్రగరువు, వంట్లమామిడి, మల్కాపొలంలో ఎన్నికలు ఏక గ్రీవం కాగా, గబ్బంగి, దేవరాపల్లి గ్రామాల్లో కోరంలేక వాయిదా వేశామన్నారు. పాత పాడేరు సచివాలయంలో-2లో జరిగిన పెసా కమిటీ ఎన్నికల్లో సల్లా రామకృష్ణ అధ్యక్షుడిగా కిల్లు రాధాకృష్ణ నాయుడు కార్యదర్శిగా ఎంపికయ్యారు. పోలింగ్ అధికారి జీవీవీ.ప్రసాద్, వీఆర్‌వో జె.వెంకటలక్ష్మి సచివాలయ సిబ్బందితో కలిసి నియామక పత్రాలను అందించారు. గుర్రగరువులో పాలికి లక్కు, మర్రి గోపాలరావు, మోదాపల్లిలో ఎంపికైన డిప్పల చిన్న శంకరరావు, కుర్ర మత్స్యరాజులకు ఎన్నికల ప్రత్యేకాధికారి, ఎంఈవో - 2 సీహెచ్.సరస్వతీ దేవి, వీఆర్‌వో నియామక పత్రాలను అందించారు.


అధికారులకు ప్రశ్నిస్తున్న కొర్రా గ్రామ గిరిజనులు

ఓటరు జాబితాల్లో తప్పులతో నిలిచిన ఎన్నికలు

డుంబ్రిగుడ: మండలంలోని కోర్రా పంచాయతీ కోర్రా, మామిడివలస, బోర్రాపాలెంలలో ఓటరు జాబితాల్లో తప్పులు దొర్లడంతో ఈ ఎన్నికలను నిలిపివేశారు. ఎన్నికల కోసం సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లో చేరి గ్రామసభ నిర్వహించారు. అధికారులు ప్రదర్శించిన ఓటరు జాబితాల్లో తప్పులుండడాన్ని గుర్తించిన గిరిజనులు నిలదీశారు. ఎన్నికలు నిలిపాలని కోరుతూ వారు బహిష్కరించారు. సమగ్ర ఓటర్ల జాబితాలతో ఎన్నికలు నిర్వహించాలని గిరిజనులు పట్టుబట్టారు. దీంతో చేసేదేమి లేక ఎన్నికల వాయిదావేసి అధికారులు తిరుగుముఖం పట్టారు.


రావణాపల్లిలో ధ్రువపత్రాలిస్తున్న అధికారులు


గుర్రగరువులో పెసా కమిటీ ప్రతినిధులకు..


డుంబ్రిగుడ మండలంలో..

చిన్నారులకు ఆధార్ నమోదు

- కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విరించి సంస్థ ద్వారా ఏర్పాటు చేస్తున్న శిశు ఆధార్ కేంద్రాల సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో శిశు ఆధార్ బ్యానర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా పిల్లల ఆధార్ నమోదు చేసుకుని కార్డులు పొందాలన్నారు. ఈ కేంద్రాల సేవలు అన్ని ప్రాంతీయ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాలలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా, విరించి సంస్థ ప్రతినిధులు మూర్తి శ్రీను, గూడవల్లి ప్రదీప్ కుమార్, ఉప్పు నాగేశ్వరరావు, శిశు ఆధార్ కో-ఆర్డినేటర్ బీవీవీ.సత్యనారాయణ, శిశు ఆధార్ ఎన్‌రోలర్లు పాల్గొన్నారు.



శిశు ఆధార్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

సేంద్రియ సాగుతో తెగుళ్ల నియంత్రణ

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి

చింతపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో సాగు ద్వారా పంటలో తెగుళ్లను నియంత్రించవచ్చునని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరిశోధన స్థానంలో సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులకు క్షేత్ర ప్రదర్శన ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో కషాయాలను వినియోగించుకుని పురుగులు, తెగుళ్లను నియంత్రించవచ్చన్నారు. కషాయాలు, జీవామృతం, ఘనజీవామృతం తయారీపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాతావరణ కేంద్రం పనితీరు విద్యార్థులకు తెలుసుకోవాలన్నారు. దీని వల్ల ప్రకృతి వైపరిత్యాల నుంచి పంటను కొంత వరకు కాపాడుకోవచ్చునన్నారు. సేంద్రీయ ఆహార ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక ధర ఉంటుందన్నారు. డిజిటల్ మార్కెట్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి పాల్గొన్నారు.


వాతావరణ విభాగం పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్త

ఆస్పత్రిలో చేరేందుకు గర్భిణి నిరాకరణ

- వైద్యాధికారి జోక్యంతో పీహెచ్‌సీకి తరలింపు
- సుఖ ప్రసవం.. తల్లీ, బిడ్డ క్షేమం

సీలేరు, జనవరి 3 , (ఆంధ్రజ్యోతి): నెలలు నిండిన గర్భిణీ ఆస్పత్రిలో చేరేందుకు పారా మెడికల్ సిబ్బంది ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ప్రసవ సమయం దగ్గర పడటంతో వైద్యాధికారి స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి ఆమెకు, కుటుంబ సభ్యులుకు అవగాహన కల్పించి గర్భిణిని ఆస్పత్రికి తరలించడంతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాలివి.. జీకే వీధి మండలం ధారకొండ పీహెచ్‌సీ పరిధిలోని ధారపూడిలో ఫాంగి లక్ష్మి నెలలు నిండడంతో ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకురావాలని ఆశ కార్యకర్తలను వైద్యాధికారి డీకే హిమబిందు పంపించారు. రెండు రోజులుగా ఆశ కార్యకర్త చేసిన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో శుక్రవారం వైద్యాధికారి హిమబిందు, వైద్య సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లారు. ధారాలమ్మ గుడి నుంచి కాలినడకన చేరుకుని కు టుంబ సభ్యులకు నచ్చచెప్పారు. చివరికి అంగీకరించడంతో ఆ గర్భిణిని రెండు కిలో మీటర్ల మేర ద్విచక్ర వాహనంపై, అక్కడ నుంచి అం బులెన్సులో ధారకొండ ఆసుపత్రికి తరలించారు. అనంతరం గ్రామంలో వైద్య సేవందించారు. తల్లీ, బిడ్డా సురక్షింతంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శోభ, ఈశ్వరి పాల్గొన్నారు.


ఆసుపత్రిలో ప్రసవం అయిన లక్ష్మిని పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

అరకులోయ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో భారతీరత్నం అన్నారు. ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమెరసీ) శిక్షణ కార్యక్రమం ఘనంగా శుక్రవారం ఓ ప్రైవేట్ రిసార్టు ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమైంది. అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుక్కుంపేట మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు పునాది పాఠశాల విద్య అన్నారు. ఈ దశలో వారికి అర్థవంతమైన విద్యనందించకుంటే రాణించలేరన్నారు. చక్కటి విద్యా బోధనకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. సమగ్రశిక్ష అకాడమి మానిటరింగ్ అధికారి భాస్కరరావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారాఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ వి.వెంకన్న, సీఆర్పీలు పాల్గొన్నారు.

డీలర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

సీలేరు, జనవరి 3 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలంలోని సీలేరు లో రెండవ జీసీసీ డిపో డీలర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ టి. రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డిపో మహిళా అభ్యర్థికి కేటాయించామన్నారు. అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 40 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 15 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 19న పాడేరులో రాత పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయం లేదా, పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కానీ అందించాలన్నారు.

సామూహిక సీమంతాలు

సీలేరు, జనవరి 3 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యకర్త యశోదమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రసవానికి వారం రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఆసుపత్రిల్లో ప్రసవంతో తల్లీ, బిడ్డల సురక్షితంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు హోటళ్లలో గదులు ఇవ్వొద్దు: పీవో

పాడేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో హోటల్ యజమానులు అప్రమ త్తంగా ఉండాలని, మైనర్లకు ఎట్టిపరిస్థితుల్లోనూ గదులను అద్దెకు ఇవ్వవద్దని ఐ టీడీఏ పీవో వి. అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పలు ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టుల్లో మైనర్లకు గదులు ఇస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారికి హోటళ్లలో గదులు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, అటువంటి వాటిని ప్రోత్సహించేఆయా హోటళ్లు, రిసార్టుల నిర్వాహకులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి వచ్చినా, ఒంటరిగా వచ్చినా మైనర్లకు గదులు ఇవ్వవద్దన్నారు. హోటళ్లు,రిసార్టులలో ఈమేరకు నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. అలాగే, బాల బాలికలు గదుల కోసం వస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

జైపాల్ సింగ్ జయంతిని అధికారికంగా జరపాలి

దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి సమిరెడ్డి

జి.మాడుగుల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడైన హాకీ జట్టుకు మొట్టమొదటి కెప్టెన్‌గా, రచయిత, ఆదివాసీ నేత, ఆదివాసీ తొలి రాజ్యాంగ సభ సభ్యుడు ఆదివాసీ సివిల్ సర్వెంట్ టైన మారంగ్ గోంకే జైపాల్ సింగ్ ముండా జయంతిని అధికారింగా జరపాలని దండకారణ్యా ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం సమిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గోంకే జైపాల్ సింగ్ ముండా 123వ జయంతిని పురస్కరించుకుని స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గోంకే జైపాల్ సింగ్ ముండా దేశ జాతీయ క్రీడయిన హాకీ జట్టులో 1928న సారథ్యం వహించి బంగారు పతకం అందించారని గుర్తు చేశారు. అలాగే ఆదివాసీ మొదటి సివిల్ సర్వెంట్‌గా, ఆదివాసీ నాయకుడిగా, అలాగే, చట్ట సభలో ఆదివాసీల ఉనికి కోసం మాట్లాడారని గుర్తు చేశారు. ఆ పోరాట ఫలితమే నేడు రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూల్స్ జైపాలసింగ్ జ్ఞాపకమని అన్నారు. ఇలాంటి ఆదివాసీ నేత చరిత్రను బాహ్య ప్రపంచానికి తెలియనీయకుండా దేశ పాలకులు చేయడం అన్యాయమని అన్నారు.


మాట్లాడుతున్న సమిరెడ్డి

భారత్ ఆదివాసీ పార్టీ సభ్యత్వ నమోదు

పాడేరురూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో 5, 6వ షెడ్యూల్స్ రూపశిల్పి, ఆదివాసీ హక్కుల ఉద్యమ నేత జైపాల్ సింగ్ ముండా జయంతి పు రస్కరించుకుని భారత్ ఆదివాసీ పార్టీ సభ్యత్వ నమోదును శుక్రవారం ప్రారంభించినట్టు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టడం రాజుబాబు తెలిపారు. స్థానిక ఆదివాసీ భవన్‌లో శుక్రవారం జైపాల్ సింగ్ ముండా 122వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసీలు స్వతంత్రంగా పార్టీ నడుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంత వరకు ఆదివాసీలు నాన్ ఆదివాసీల పార్టీలలో సభ్యులుగా ఉన్నారన్నారు. జీవో 3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్.పి.రామకృష్ణ, కోశాధికారి మర్రిచెట్టు పోతురాజు, తామర సురేష్‌బాబు, కిల్లో ప్రసాదరావు, నగేష్, శశికుమార్, చలపతి పాల్గొన్నారు.



జైపాల్ సింగ్ ముండా చిత్రపటానికి నివాళులర్పి ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం


వనుగుమ్మలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):మానసిక, శారీరక ఉ ల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని వైస్ ఎంపీపీ ఎస్. భాగ్యవతి అన్నారు. వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం సంక్రాంతి పండుగ సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తితో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీతారాం, క్రికెట్ నిర్వాహకులు మూర్తి, కోటి, కృష్ణ, త్రినాద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్స్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్‌లో బోధనకు అతిథి ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ గురుకులం ఓఎస్‌డీ పీఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హతలు, మెరిట్ లిస్టును హెచ్‌టీటీపీఎస్//అల్లూరి సీతారామరాజు.ఎపి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ లిస్టులో ఏమైనా సందేహా లు ఉంటే ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 94937 58072, 94941 61268 ఫోన్ నంబర్లకు, లేదా నేరుగా గురుకులం సెల్ పాడేరులో సంప్రదించాలని తెలిపారు.

పెసా ఎన్నికలు


ఉపాధ్యక్ష, కార్యదర్శులకు ధ్రువపత్రాలిస్తున్న అధికారులు

గూడెంకొత్తవీధి: మండలంలో 31 గ్రామ సభల్లో పెసా ఎన్నికలు ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. 16 పంచాయతీలకుగానూ 74 పెసా ఎన్నికలు జరగాల్సి ఉందని, తొలిరోజు 31 గ్రామ సభల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శి ఎన్నికలు పూర్తి చేసినట్టు వివరించారు. 28 గ్రామ సభల్లో ఏకగ్రీవంగానూ, 3 గ్రామసభల్లో చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక జరిగిందన్నారు.

వెనుకబడిన వర్గాల వారికి స్వయం ఉపాధి రుణాలు

గూడెంకొత్తవీధి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెనుకబడిన కులాలకు (బీసీ) ప్రభుత్వం రుణాలు మంజూరు చేసినట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. జీకేవీధి మండలానికి 25 యూనిట్లకు సంబంధించి రూ.46.75 లక్షల రుణాలు కేటాయించామన్నారు. సీలేరు యూనియన్ బ్యాంక్ పరిధిలో 18, జీకేవీధి యూకో బ్యాంక్ పరిధిలో 7 యూనిట్లు కేటాయించినట్టు తెలిపారు. దరఖాస్తుదారులు ఎంపిక చేసుకున్న యూనిట్ ఆధారంగా రూ.2 లక్షలు, రూ.2-3లక్షలు, రూ.3-5 లక్షలు మంజూరుచేసినట్టు వివరించారు. లబ్ధిదారులకు రూ.75వేల నుంచి రూ.రెండు లక్షల వరకు రాయితీ ఉంటుందన్నారు. ఆసక్తిగల బీసీ అభ్యర్థులు బ్యాంకర్ల అంగీకారంతో దరఖాస్తు చేసుకుంటే అర్హులకు రుణాలు అందజేస్తామన్నారు.


జీనబాడులో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

పాడేరురూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళా విద్యకు దారి దీపంగా సావిత్రిబాయిపూలే నిలిచారని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం ఎస్.విశ్వప్రసాద్ అధ్యక్షతన పాఠశాల ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే, జైపాల్ సింగ్ ముండా చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వన్నెపూరి భీమ్‌నాయుడు పూలే సేవలను వివరించారు. ఉపాధ్యాయులు కేజే రామారావు, దిలీప్ కుమార్, కేశవరావు, కేశవ, ప్రసాదరావు, కొండబాబు, రాజేష్, మహేశ్వరి, గంగాభవాణి, అరుణ, పుణ్యవతి, వసంతకుమారి పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సావిత్రి బాయి చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టిబ్బాయి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు రమేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అరకులోయ: సావిత్రిబాయిపూలే జయంతిని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కో-ఎడ్యుకేషన్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యాపకులు డాక్టర్ శశికుమార్, కె.ధర్మారావు, రోజారాణి, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ లక్ష్మి, ము రళీకృష్ణ, పి.వి. ప్రసాద్, లాలికుమారి, ప్రణీత, సంధ్య, సరస్వతి, అన్నపూర్ణ ,అఖిల్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని లింగేటి గ్రామ పాఠశాలలో సావిత్రిబాయిపూలే 194వ జయంతి ఘనంగా నిర్వహించారు.

డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుం పాఠశాలలో సావిత్రి బాయిపూలే చిత్రపటానికి ఎంఈవో సుందరరావు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.సరియవలస పాఠశాలలో హెచ్‌ఎం జలంధర్ సమక్షంలోచిన్నారులుఆమెకునివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరావు, శ్రీరాం, బాలకృష్ణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినిలకు సన్మానం


ఉపాధ్యాయినిలకు సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చింతపల్లి:ఉపాధ్యాయిని, సంఘసంస్కర్త సావిత్రిబాయిపూలే సేవలు చిరస్మరణీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. శుక్రవారం లంబసింగి బాలికల ఆశ్రమ పాఠశాలలోసావిత్రిబాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులు ఈదల గోల్డ్, సంపరి రిబక, అరడ నారాయణమ్మ, ఎస్. అపరంజని, రొబ్బ వెంకట రమణమ్మ, కవితనాయుడు, పద్మ, శెట్టి ఉత్తరకుమారి, నూకాలమ్మలను పీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సెలర్ కొర్ర మత్స్యలింగం, మండలాధ్యక్షుడు కోరాబు వెంకటరమణ, జిల్లా కౌన్సెలర్ యశోధ, మండల మహిళా కార్యదర్శి కృష్ణకుమారి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: కించాయిపుట్టులోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి ఎంపీడీవో శ్రీసాయిహర్ష, సర్పంచ్ ఎస్.సుభాష్, ఉపాధ్యాయులు తదితరులు నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని జీనబాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో హెచ్‌ఎం మల్లీశ్వరి ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోని మాటూరి శ్రీనివాసు, సుజాత, సుబ్బాయి, ధృవకర్, కృష్ణమూర్తి, బేబీరాణి, సత్యనారాయణ, లక్ష్మిఈశ్వరీ, రమేష్, వైఎస్ఆర్ టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ టి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.


అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం


బ్యాంకర్లతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మహిళా స్వావలంబనకు కృషిచేయాలి

▸ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బందితో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాలు, రుణ మంజూరు, చెల్లింపులు, బకాయిలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. చిన్నతరహా పరిశ్రలు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులకు బ్రాండింగ్, ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. శుక్రవారం గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. పైపులైన్లు, మోటార్లు, బోర్లు బాగా పనిచేసేటట్టు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మరమ్మతులు చేయించి సిద్ధం చేయాలని సూచించారు.

వెంకన్నఆలయానికి నూతన పాలకవర్గం


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు

చోడవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ ఆపదహర శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గ సభ్యులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయానికి నూతన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఖరారు చేశారు. కమిటీ చైర్మన్‌గా వి.శంకర్, డైరెక్టర్లుగా జె.కాశిరాజు, జీవీఏ ఎన్.మూర్తి, వి.చినబాబు ఎన్నికయ్యారు. అలాగే సభ్యులుగా ఉపాధ్యాయుల శ్రీనివాస్, ముక్కవిల్లి విస్సు. జీవీపీ రాజువర్మ, కృష్ణవేణి, ఎస్.లక్ష్మి, శాంతకుమారి, పి.సత్యవతి, నూకరాజు, పి.అప్పారావు, మొల్లు రాజు, బి.నరసింగరావు, బి.శ్యామ్, కనక మహలక్ష్మి, అప్పారావు, వెంకట హేమలత, డి.వీర్రాజు, వెంకటలక్ష్మి, ఈర్లె వెంకటేశ్, గుప్తా, రుక్మిణికుమారి, బోను రాజు, పి.రమేశ్, పూసర్ల కిరణ్ నియమితులయ్యారు. వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సేవలు అందిస్తామని చైర్మన్ శంకర్ తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థినులకు జ్వరాలు


జ్వరంతో మంచంపై నిద్రిస్తున్న బాలిక

చీడికాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంచాల మోడల్ స్కూల్ హాస్టల్ బాలికలు పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. శుక్రవారం ఉదయం నాటికి నలుగురు బాలికలు జ్వరాలు, చిన్నచిన్న వ్యాధులతో బాధపడుతుండగా, వీరిలో ముగ్గురు ఒకే మంచంపైన నిద్రిస్తున్నారు. ఆస్పత్రికి ఎందుకు వెళ్లలేదని బాలికలను ప్రశ్నించగా, తమను ఎవరూ తీసుకువెళ్లలేదని తెలిపారు. ఈ విషయమై హాస్టల్ మేట్రిన్ కావ్యను వివరణ కోరగా జ్వరం, చిన్న చిన్న వ్యాధులు వచ్చిన వెంటనే తమ వద్ద మందులను ఇస్తామని, అంతకీ తగ్గకపోతే చీడికాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్తామని చెప్పారు. అయినా అక్కడి వైద్యాధికారులు సక్రమంగా చూడడం లేదని ఆమె వాపోయారు.

33 గ్రామాల్లో 111 అర్జీల పరిష్కారం


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటివరకు నిర్వహించిన సదస్సుల్లో 464 అర్జీలు వచ్చాయని, వీటిలో 111 పరిష్కరించామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. నాతవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ తండ్రి లేదా తల్లి చనిపోయిన వారసులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నట్టు చెప్పారు. సరిహద్దు సమస్యలు ఉన్న రైతులు అర్జీలు పెట్టుకుంటే సరిచేస్తామని చెప్పారు. ఈ సదస్సులో మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, పి.కొండబాబు, టీడీపీ నేత ఎ.మాణిక్యం వీఆర్వో బాబు, మండల సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎం.అలమండ సర్పంచ్ సస్పెన్షన్

దేవరాపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభి యోగంపై ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్నాథరావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తూ అదే గ్రామానికి చెందిన గొర్లె గోవింద గత ఏడాది జూన్ 26న డీపీవోకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు డీపీవో ఆదేశించారు. ఈ మేరకు ఆగస్టు 31వ తేదీన ఈవోపీఆర్డీ, సెప్టెంబరు 19న తహసీల్దార్ విచారణ చేశారు. వారి విచారణ నివేదిక ఆధారంగా సర్పంచ్ దాడి జగన్నాథరావుతోపాటు అప్పటి పంచాయతీ కార్యదర్శి పి.శివ ప్రసాదుల నుంచి డీపీవో సంజాయిషీ కోరారు. సర్పంచ్ నుంచి ఎటువంటి వివరణ రాకపోవడంతో గొర్లె గోవింద చేసిన ఆరోపణ నిజమేనని నిర్ధారిస్తూ సర్పంచ్ అధికారాల నుంచి మూడు నెలలుపాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఈ సమాచారాన్ని ఎంపీడీఓ, ఈవోపీఆర్డీ ఎం.అలమండ సచివాలయానికి పంపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జగన్నాథరావు మాట్లాడుతూ తనపై కొందరు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ఈ ఉత్తర్వులపై న్యాయపోరాటం చేస్తానన్నారు.

నేటి నుంచి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా పురుషుల బీచ్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలను మొదటిసారిగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో నిర్వహించనున్నట్టు విశాఖ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. త్వరలో ఉత్తరాఖండ్‌లో జరగనున్న 38వ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టును ఈ సందర్భంగా ఎంపిక చేస్తామని ఆయన వెల్లడించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు, పతకాలు ప్రదానం చేస్తామన్నారు.

పాలిథిన్ భూతం.. నిషేధం శూన్యం!

▸ గ్రామాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
▸ ఎక్కడికక్కడే పేరుకుంటున్న చెత్తాచెదారం, వ్యర్థాలు
▸ పర్యావరణానికి పొంచివున్న ముప్పు
▸ పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


జంపెన రహదారి పక్కనే గుట్టలా పేరుకుపోయిన చెత్తాచెదారం

మాడుగుల రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథిన్, ప్లాస్టిక్ రహితంగా గ్రామాలను తీర్చిదిద్దాలన్న ఆశయం నెరవేరడం లేదు. ఇందుకోసం ఎన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నా ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదు. పట్టణ ప్రాంతాల్లో పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగాన్ని కొంత వరకు కట్టడి చేస్తున్నా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం కష్టతరంగా మారుతోంది. ఫలితంగా ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వస్తువులు, వగైరా దర్శనమిస్తూనే ఉన్నాయి. దీంతో గ్రామాలు, రహదారుల పక్కనే వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పని కాదులే అన్నట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు


ఘాట్ రోడ్డు-వాడపాడు మార్గంలో పేరుకుపోయిన పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు

వెల్లువెత్తుతున్నాయి.

గతంలో నిత్యావసర సరకులు, ఇతర సామగ్రి కోసం గుడ్డ చేతి సంచులు, చిన్నపాటి క్యారీ బ్యాగులు తీసుకువెళ్లేవారు. ప్రస్తుతం ఏ చిన్న వస్తువు కొనుగోలు చేసినా పాలిథిన్ కవర్‌లతో ఇవ్వాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలో నాశనం కాని నీలం రంగు సంచులు వినియోగిస్తున్నారు. ఇక డిస్పోజల్ గ్లాసులు, ప్లాస్టిక్ చెంచాలు, ప్లేట్లు ఇబ్బడి ముబ్బడిగా దర్శనమిస్తున్నాయి. మాడుగుల మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి వాడపాడు వెళ్లే రోడ్డులో రోడ్డుకిరువైపులా పాలిథిన్ కవర్లు, గ్లాసులు, తదితర చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. జ్యూస్ షాపులు, మద్యం దుకాణాల పక్కన గ్లాసులను రోడ్డుపక్కనే కనిపిస్తున్నాయి. జంపెన గ్రామంలో రోడ్డు పక్కనే చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఈ వ్యర్థాలకు నిప్పు పెడుతుండడంతో సమస్య మరింత జటిలమవుతోంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ పని కాదన్నట్టు చూసీ చూడకుండా వెళ్లిపోతున్నారని ప్రజలు, వాహన చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లో పాలిథిన్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని నిరసన


జీలుగులోవలో డోలిమోతలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొండ శిఖర గ్రామం జీలుగులోవ గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డోలీ మోతలతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు మర్రి శ్రీను మాట్లాడుతూ జీలుగులోవ, నేరేడుబంద గ్రామాలలో పీవీటీజీ కొందు గిరిజనులు జీవిస్తున్నారని, ఈ గ్రామాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించి రోడ్లు నిర్మాణానికి ఫారెస్ట్ అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో రూ.2.5 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర కొండపై రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఫారెస్ట్ అనుమతులు లేక పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చలిసింగం గిరిజన గ్రామానికి శికాయిపాడు నుంచి రోడ్డు నిర్మాణానికి రూ.2.66 కోట్లు మంజూరైనా ఫారెస్ట్ అనుమతులు లేవన్నారు. దీనిపై ఈ నెల 25వ కలెక్టరేట్ ఎదుట డోలీ మోతలతో నిరసన తెలుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, గిరిజన నాయకులు కొర్రా బాలరాజు, కిల్లో సూరిబాబు పాల్గొన్నారు.

మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కైలాసగిరి రిజర్వు పోలీసు మైదానంలో శుక్రవారం మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. మహిళా పోలీసు అధికారుల పర్యవేక్షణలో తొలుత అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో తొలి రోజు హాజరైన 278 మందికి పరీక్షలు నిర్వహించారు. కాగా పురుషుల దేహదారుఢ్య పరీక్షలు నాలుగో రోజు కొనసాగాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్పీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్‌బీ, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్లు బాలసూర్యారావు టి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో పెసా కమిటీ ఎన్నికలు

నాతవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది గ్రామాల్లో శుక్రవారం పెసా కమిటీల ఎన్నికలు జరిగాయి. సరుగుడు ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా వి.బాలరాజు, ఎం.గంగాధరరావు, పినడిపాలెం-వెలగాడ అప్పారావు, కురుపల్లి పోతురాజు, కురువాడ-పాసిల అప్పారావు, వినయకరాజ్, మాధవనగరం-అరల రాముడు, సోముల పైడికొండ, కేవీ.శరభవరం-కర్రిగోపీప్రసాద్, రామన్నపాలెం-తరుబొయిన రాంబాబు, కించు నాగేశ్వరరావు, కె.సిరిపురం-బండి ద్వారబాబు, ఉల్లి చిన్నబ్బాయి, సుందరకోట-పాండవుల నూకరాజు, జర్తా జోగిబాబు, లను ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. మిగిలిన కొండ ధర్మవరం, కృష్ణాపురం అగ్రహారం గ్రామాలకు ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలను శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. ఎన్నికల అధికారులుగా కె.వరహాలబాబు ఒ.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో కమిటీలే కీలకం

రోలుగుంట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలే కీలకమని ఎంఈవో జగ్గారావు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాఠశాలల కమిటీ చైర్మన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 56 పాఠశాలకు చెందిన కమిటీల చైర్మన్లు ఈ శిక్షణ కార్యక్రానికి హాజరయ్యారు. అలాగే పాఠశాలల అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, సమకాలిన సమస్యలు, పరిష్కారాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

అభివృద్ధిపై కమిటీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

చీడికాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యా కమిటీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో కె.బొంజుబాబు కోరారు. మంచాల మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల టీవోటీ చిరంజీవి ఆచార్యులు, ఎంఈవో-2 బీవీ.రమణ, టీవోటీలు శాస్త్రి, జి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు భాగస్వామ్యం కావాలని ఎంపీపీ పైల రాజు కోరారు. ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ, పేరెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసినప్పుడే ఆ పాఠశాల అభివృద్ధికి సాధ్యమన్నారు. విద్యా స్థాయి పెంపులో కమిటీ సభ్యులు ఉపాధ్యాయులతో సమన్వయం కావాలని ఎంపీడీవో వెంకన్నబాబు కోరారు. మండలంలో మొత్తం 72 పాఠశాలలకు తల్లిదండ్రుల కమిటీలు ఉన్నట్టు ఎంఈవో బ్రహ్మాజీ తెలిపారు. కమిటీలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీల చైర్మన్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చోడవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తహసీల్దార్ అంబటి రామారావు తెలిపారు. మండలంలోని గోవాడలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు స్థానిక నాయకుడు ఏడువాక సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల మీదుగా బస్సులు నడపాలి

▸ ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌దొన్నుదొరకు వినతి


ఆర్టీసీ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మాడుగుల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని మాడుగుల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొడ్డేడ మల్లికార్జునుడు, రమేశ్, మరువాడ ఈశ్వరరావు తదితరులు కోరారు. ఈ మేరకు సంస్థ విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొరకు శుక్రవారం అరకులోయకు వెళ్లి లిఖితపూర్వకంగా వినతిపత్రాన్ని అందించారు. విశాఖ, అనకాపల్లి, పాడేరు డిపోల నుంచి నడిచే బస్సు సర్వీసులు మాడుగుల మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాడేరు నుంచి చోడవరం వరకు తిరిగే ట్రిప్‌ల బస్సు సర్వీసును వయా మాడుగుల మీదుగా నడపాలని విజ్ఞప్తి చేశారు. మాడుగుల సాగరం రోడ్డులో వంతెన నిర్మాణం చేపట్టి బీటీ రోడ్డు వేశారని, అనకాపల్లి, విశాఖ డిపోల నుంచి పాడేరు వెళ్లే బస్సులు మాడుగుల వయా కోడూరు మీదుగా నడపాలని, పాడేరు నుంచి విశాఖ అనకాపల్లి వెళ్లే సర్వీసులు కోడూరు, సాగరం వయా మాడుగుల మీదుగా నడిపేలా చూడాలని కోరారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. దీనికి స్పందించిన చైర్మన్ మాడుగుల, సాగరం మీదుగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నికలో ఘర్షణ


వాగ్వాదం చేసుకుంటున్న బీజేపీ కార్యకర్తలు

మాకవరపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్నిక మరోమారు రచ్చ రచ్చ అయింది. దీంతో ఎన్నిక వాయిదా పడింది. రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఎన్నికల సంఘం పరిశీలకుడిగా పర్శరామరాజుతోపాటు ఎన్నికల పరిశీలకుడు కాళ్ల సుబ్బారావు హాజరయ్యారు. అధ్యక్ష పదవికి ఇద్దరి మధ్య తీవ్ర పోటీ ఉండడంతో ఇటీవల పదవి ఎంపిక ప్రక్రియ వద్ద తీవ్ర తోపులాట జరిగింది. దీంతో ముందుగా పోటీపడుతున్న ఇద్దరు వ్యక్తులతో జిల్లా పరిశీలికుడిగా మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న వారిని తొలగించి, శ్రీనుకు అవకాశం కల్పించాలని సూచించారు. బీజేపీ నాయకులు ఎ.రాంబాబు, జి.రఘుచక్రవర్తి, ఎన్.గంగబాబు, బి.ఎర్రినాయుడు, ఆంజనేయులు వారితో గొడవకు దిగ్గారు. దీంతో చేసేదిలేక ఇద్దరు వ్యక్తులను తీసుకొని అక్కడ నుంచి వెళ్లిపోయారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

నర్సీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో మొట్టమొదటి మహిళా టీచర్‌గా సావిత్రిబాయి పనిచేశారని విద్యార్థులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్.గౌతమ్, కేవీపీఎస్ నేత చిరంజీవి పాల్గొన్నారు.

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

చోడవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐవీవీ సత్యవతి, లక్ష్మీ, మంగమ్మ, ప్రోగ్రాం అధికారులు మాల్యాద్రి వి.అప్పలనాయుడు, రఫియుద్దీన్ పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎంబీపట్నం హైస్కూల్ హెచ్ఎం చిరంజీవిపాత్రుడు పేర్కొన్నారు. శుక్రవారం ఎంబీపట్నం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు కృష్ణవేణి, అమరవాణి తదితరులను శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవిపాత్రుడు మహిళల త్యాగాలను కొనియాడినారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: జైతవరం సచివాలయ ఆవరణలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.సత్యవతి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కొల్లి నవీన్ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: కాశీపురం జిల్లా పరిషత్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఎంఈవో ఉషారాణి, హెచ్ఎంలు సుందరిలను సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు దొగ్గ శ్రీనివాస్, బత్తి శ్రీనివాసుకుమార్, సురేశ్, పెద్దాడ వెంకటరమణ, లక్ష్మణరావు, కె.రాంబాబు పాల్గొన్నారు.

'సరుగుడు జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం'

నాతవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సరుగుడు జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ చెప్పరు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణతో కలసి శుక్రవారం జలపాతానికి వెళ్లే రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం తదితర దూరప్రాంతాల ఉంచి ఈ జలపాతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నదన్నారు. అందువల్ల పర్యాటకుల బస్సుల కోసం పార్కింగ్, రోడ్డు తదితర సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం జలపాతం దగ్గర పర్యాటకులకు డ్రెసింగ్ రూమ్‌లు, కాటేజీల నిర్మాణం, సిమ్మెంట్ మెట్ల ఏర్పాటు తదితర సౌకర్యాలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు పి.రాజుబాబు, ఏనుగు చిన్నా, గంగాధర్, నూకరత్నం, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ చెరకు రైతులకు రూ.3 కోట్లు బకాయిల చెల్లింపు

చోడవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులకు గత సీజన్‌కు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు రూ.7.16 కోట్లలో రూ.3 కోట్లు శుక్రవారం రైతుల ఖాతాలకు జమ చేసినట్టు ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు తెలిపారు. మిగిలిన బకాయిలు కూడా త్వరలోనే చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని ఎండీ వివరించారు.

బాలికలకు కబడ్డీ పోటీలు

నర్సీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం. క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి), పెదబొడ్డేపల్లి, చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఐదు టీమ్‌లుగా పోటీలో పాల్గొన్నారు. తురకబడి, పెదబొడ్డేపల్లి జెడ్పీహెచ్ విద్యార్థులు మొదటి, ద్వితీయ స్థానాలు సాధించారు. వ్యాపారవేత్త వెలగా నారాయణరావు, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఎ.హనుతేజ మెడల్స్ విజేతలకు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

లింగంపేట గ్రామాభివృద్ధిపై సభ

కృష్ణాదేవిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని లింగంపేట గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పంచాయతీ నిధులతో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు జరిగేలా చూస్తామన్నారు. ఇప్పటికే వీధిలైట్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పవన్‌కుమార్, టీడీపీ నాయకులు ఎం.రమణ, పాలకవర్గం సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా సిబ్బంది సమస్యలపై ధర్నా

నర్సీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధం ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. పెదబొడ్డేపల్లిలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో కార్మికులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్నామని, తమకు 2024 జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎం.అప్పలనాయుడు, సభ్యులు యర్రా ప్రకాశ్, నాగేంద్ర, దుర్గా పాల్గొన్నారు

త్వరతగతిన పశుగణన

కె.కోటపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశుగణన కార్యక్రమాన్ని త్వరతగతిన చేపట్టాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ పశు వైద్య సహాయకులను ఆదేశించారు. శుక్రవారం కె.సంతపాలెంలో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన గోకులం షెడ్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ పశు వైద్యులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

నాతవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు కోరారు. నాతవరం హైస్కూల్‌ను తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చిటికెల శ్రీను, టీడీపీ నాయకులతో కలసి శుక్రవారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు ఎ.మాణిక్యం, శెట్టి లోవ, నానాజీ, సిహెచ్.శ్రీను, శెట్టి గోపీ పాల్గొన్నారు.

ఆంగ్లంపై గ్రామీణ విద్యార్థులకు పట్టు!

ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్న చినదొడ్డిగల్లు హైస్కూల్ టీచర్

- రవీంద్రనాథ్ ఠాగూర్ పేరుతో ఇంగ్లిష్ క్లబ్ ఏర్పాటు
- ఆంగ్లంలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు
- స్పెల్‌బీ, డిబేట్‌లు, గ్రూప్ డిస్కషన్స్
- సొంత సొమ్ముతో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న వెంకట రమణ మాస్టారు

నక్కపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): **గ్రామీణ విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు, భావ వ్యక్తీకరణ వంటివాటిల్లో ఆంగ్లంలో మాట్లాడాలంటే తడబడుతున్నారు. ఇంగ్లిష్‌లో చదవడం, రాయడం బాగానే వున్నప్పటికీ అనర్గళంగా మాట్లాడలేకపోతున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులు సైతం ఆంగ్లభాషపై పట్టుసాధించలేకపోతున్నామని మనోవేదన చెందుతుంటారు. అటువంటి వారి కోసం నేనున్నానంటూ.. చినదొడ్డిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఏడిద వెంకట రమణ ముందుకొచ్చారు. తరగతి గదిలో తన సబ్జెక్టుకు సంబంధించిన పాఠాలను బోధించి, ఇక తన బాధ్యత అయిపోయిందని చేతులు దులుపుకుని వెళ్లడంలేదు. తాను పనిచేస్తున్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్ల భాషలో కూడా చక్కగా మాట్లాడాలన్నదే ఆయన తపన.**

నక్కపల్లి మండలం డీఎల్‌పురం ఉన్నత పాఠశాలలో 2017లో ఇంగ్లిష్ టీచర్‌గా చేరిన ఏడిద వెంకట రమణ అదే ఏడాది 'రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్'ను ఏర్పాటు చేశారు. డీఎల్‌పురం, బంగారమ్మపేట, నెల్లిపూడి, గునిపూడి, అమలాపురం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఆంగ్ల భాషపై తర్ఫీదు ఇస్తున్నారు. సుమారు 300 మంది విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో భాగంగా ఆంగ్లంలో చక్కగా మాట్లాడేలా తీర్చిదిద్దారు. పిల్లలకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై భయం పోగొట్టి, ఆంగ్ల భాషపై ఆసక్తి పెంచేందుకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్‌లు, స్కిట్‌లు వంటి పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి సొంత సొమ్ముతో బహుమతులు కొనుగోలు చేసి అందచేస్తున్నారు. ఇంగ్లిష్ నాటికలను కూడా ప్రదర్శించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఇదే మండలం చినదొడ్డిగల్లు ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఈ పాఠశాలలో కూడా ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 150 మంది విద్యార్థులకు ఆంగ్ల భాషలో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి నెలా స్పెల్‌బీ, డిబేట్‌లు, గ్రూప్ డిస్కషన్స్ పెట్టి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. అధికారులు, అతిథులు ఎవరైనా పాఠశాలను సందర్శించినప్పుడు మాస్టారు వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అనర్గళంగా, తడబాటు లేకుండా ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే వారు ఆశ్చర్యపోతున్నారు.


ఆంగ్లంలో విద్యార్థుల సందేహాలను నివృత్తిచేస్తున్న వెంకట రమణ మాస్టారు

ఇంగ్లిష్‌లోనే మాట్లాడుకుంటున్నాం



వెంకట రమణ మాస్టారు మా పాఠశాలకు రాకముందు వరకు ఇంగ్లిష్ క్లాస్ అంటే భయమేసేది. పాఠాలను బట్టీపట్టి పరీక్షలు రాసేవాడిని. వెంకట రమణ సార్ మా స్కూల్‌కి వచ్చిన తరువాత ఆయన ఏర్పాటు చేసిన 'రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్‌'లో చేరాను. విద్యార్థులకు అర్థమయ్యేలా, సులువుగా ఇంగ్లిష్‌లో మాట్లాడేలా ఆయన తర్ఫీదు ఇస్తున్నారు. ఇప్పుడు మా స్కూల్లో చాలా మంది విద్యార్థులు ఇంగ్లిష్‌ను కష్టంగా కాకుండా.. ఇష్టంగా మాట్లాడుతున్నారు. **- జి.రాజేశ్,** 9వ తరగతి, చినదొడ్డిగల్లు హైస్కూల్


ఇంగ్లిష్‌లో వ్యాసరచన పోటీల్లో విద్యార్థినులు

ఇంగ్లిష్‌పై పిల్లల్లో భయం పోగొట్టడానికే..



గ్రామీణ ప్రాంతంలో.. అందునా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇంగ్లిష్ భాషంటే కొరకరాని కొయ్యగా భావిస్తుంటారు. ఇంగ్లిష్‌లో మాట్లాడాలంటే సంశయిస్తుంటారు. విద్యార్థుల్లో ఇటువంటి భయాన్ని, బెరుకును పోగొట్టడానికి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్‌ను స్థాపించాను. గత ఏడేళ్ల కాలంలో దాదాపు ఐదు వందల మంది విద్యార్థులకు ఈ క్లబ్ ద్వారా ఆంగ్ల భాషపై శిక్షణ ఇచ్చాను. వీరు చక్కగా ఇంగ్లిషులో మాట్లాడుకుంటున్నారు. వాళ్లను చూస్తే నాకు ఎంతో సంతృప్తి కలుగుతున్నది.

- ఏడిద వెంకట రమణ,
'రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్' వ్యవస్థాపకులు

చాలా చక్కగా శిక్షణ ఇస్తున్నారు



ఆంగ్ల భాషపై పట్టు సాధించడం, తప్పుల్లేకుండా మాట్లాడడంతో పెద్ద కష్టమేమీ కాదని వెంకట రమణ మాస్టారు తర్ఫీదు ద్వారా తెలిసింది. ఆరో తరగతిలో వున్నప్పుడు ఇంగ్లిష్ సబ్జెక్టు అంటే భయమేసేది. దీంతో మాస్టారు ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ క్లబ్‌లో చేరాను. చాలా చక్కగా శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలలో వున్నప్పుడు సాధ్యమైనంత వరకు ఇంగ్లిష్‌లోనే మాట్లాడుకుంటున్నాం.

- జి.రేష్మాంబిక,
7వ తరగతి, చినదొడ్డిగల్లు హైస్కూల్

ప్రధాని సభకు విస్తృత ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

నుంచి 40 వేల మందిని సమీకరించేందుకు నిర్ణయించామన్నారు. సభకు వచ్చే వారికి రవాణా, భోజన సదుపాయం కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. నగర సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ 22 ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని విశాఖ కలెక్టర్, నగర సీపీలను ఆదేశించారు. ప్రధాని ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన సంపత్ వినాయక్ ఆలయం వద్దకు చేరుకుని అక్కడ నుంచి ఓపెన్‌టాప్ వాహనంపై బహిరంగ సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకూ రోడ్‌షో నిర్వహిస్తారన్నారు. సంపత్ వినాయక్ ఆలయం నుంచి సభా ప్రాంగణం వరకూ విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. సభకు అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే వారికి భోజన వసతి కల్పించాలని, వచ్చేవారంతా సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం రెండు సబ్జెక్టులను ఉదయం నుంచి సాయంత్రం వరకు చదివించి అనంతరం పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇంకా స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ నుంచి వచ్చిన మోడల్ పేపర్లు, ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందించి ప్రాక్టీస్ చేయిస్తున్నారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కమిటీ రూపొందించిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివిస్తున్నారు. ఈసారి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యా శాఖ అధికారులు రూపొందించిన ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇందుకోసం డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు నేతృత్వంలో మండల విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ప్రణాళిక అమలు తీరును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. జిల్లాలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 89 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థిని


రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన కేతిరెడ్డి సత్యశ్యామల

కొత్తూరు (అనకాపల్లి), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ (ఆర్మీ విభాగం) సీనియర్ అండర్ ఆఫీసర్ కేతిరెడ్డి సత్య శ్యామల ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు తెలిపారు. బెటాలియన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గ్రూప్‌కి, అక్కడ ఉత్తమంగా రాణించిన వారిని డైరెక్టరేట్‌కు పంపుతారని ఆయన పేర్కొన్నారు. డైరెక్టరేట్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక చేస్తారని తెలియజేశారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన మూడు రిపబ్లిక్ డే క్యాంపుల్లో అన్ని విభాగాల్లో సత్య శ్యామల ఉత్తమ ప్రతిభ కనబరిచి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైందని చెప్పారు.

అందుబాటులోకి జల్లూరు వంతెన

... 5వ పేజీ తరువాయి

పట్టించుకోలేదు.. కొత్త వంతెన అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఎన్నికల సందర్భంగా అనకాపల్లి ప్రస్తుతం ఎంపీ సీఎం రమేశ్.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జల్లూరు వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఎంపీగా గెలిచిన తరువాత ఆగస్టులో జల్లూరు వంతెనను పరిశీలించారు. పెండింగ్ పనులకు నిధులు ఎంతమేర అవసరం అవుతాయో ఆర్అండ్‌బీ అధికారులతో అంచనాలు తయారు చేయించారు. అనంతరం కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే తరచూ వర్షాలు కురుస్తుండడంతో ఇటీవల వరకు పనులు చాలా మందకొడిగా సాగాయి. సుమారు పది రోజుల నుంచి వర్షాలు పడకపోవడంతో పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం గ్రావెల్‌తో అప్రోచ్ రోడ్లు నిర్మించారు. దీనిపైన సిమెంట్ కాంక్రీట్, మిక్చర్, ఆపైన తారు రోడ్డు వేస్తారు. ఇదే సమయంలో రోడ్డుకి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తారు. సంక్రాంతి పండుగలోగా అన్నిపనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. దీంతో దాదాపు పదేళ్ల నుంచి ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజల రవాణా కష్టాలు తరనున్నాయి. వంతెన నిర్మాణం పూర్తయితే గతంలో రద్దు చేసిన నర్సీపట్నం- అడ్డురోడ్డు- రేవుపోలవరం ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించే అవకాశం వుంది. ఈ రూట్‌లో ప్రయాణికులకు వ్యయప్రయాసలు తప్పుతాయి.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో కలాసీల మేస్త్రి మృతి


పంచదార్ల అప్పడు (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌కు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మోసయ్యపేటకు చెందిన పంచదార్ల అప్పడు అచ్యుతాపురంలో కలాసీలకు మేస్త్రి. గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి అచ్యుతాపురం జంక్షన్ వైపు నడుచుకుంటూ వెళుతుండగా, అనకాపల్లి వైపు నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొన్నది. దీంతో తీవ్ర గాయలైన ఆయనను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో గాజువాకలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పంచదార్ల అప్పడు కుమారుడు పైడిరాజు ప్రస్తుతం మోసయ్యపేట సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పడి రైతు మృతి

కొత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బవులవాడలో తాటిచెట్టు పడి రైతు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. బవులవాడ గ్రామానికి చెందిన గొల్లవిల్లి అప్పారావు (57) గురువారం పొలంలో గేదెలు మేపుతున్నాడు. ఈ క్రమంలో అక్కడ వున్న ఒక తాటిచెట్టు కూలిపోయి ఇతనిపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన తోటి రైతులు వెంటనే అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు విశాఖపట్నం తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. ఇతని కుమారుడు గోవిందరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కాపురానికి భర్త వద్దన్నాడని ఆత్మహత్యాయత్నం

రావికమతం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భర్త కాపురానికి నిరాకరించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని మేడివాడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మేడివాడ గ్రామానికి చెందిన వేములపూడి సువర్ణ, దొండపూడి గ్రామానికి చెందిన మజ్జి మోహన్ ప్రేమించుకున్నారు. వేర్వేరు కులాలు కావడంతో ఇరు కుటుంబాల వారు కాదనడంతో వారిని ఎదిరించి మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లుగా విశాఖపట్నంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒక కుమారుడు కలిగాడు. ప్రస్తుతం సువర్ణ ఆరు నెలల గర్భవతి. రెండు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో సువర్ణను వదిలి మోహన్ చెన్నై వెళ్లిపోయాడు. దీంతో సువర్ణ కొడుకును తీసుకొని పుట్టింటికి వచ్చేసింది. భర్త తనను వదిలి రెండో పెళ్లికి సిద్ధపడుతున్నాడని ఆమె స్పందనలో ఫిర్యాదు చేసింది. రావికమతం పోలీసులు మోహన్‌ను స్టేషన్‌కు రప్పించి రెండో పెళ్లికి సిద్ధపడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించి, సువర్ణను వెంట తీసుకువెళ్లాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సువర్ణ పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు రావికమతం పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ప్రాథమిక వైద్యం అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గర్భిణి కావడంతో మెరుగైన వైద్యం అవసరమని విశాఖ కేజీహెచ్‌కు పంపారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష

చోడవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు పది సంవత్సరాలపాటు కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎ.రత్నకుమార్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. అల్లూరి జిల్లా అరకులోయ మండలం బొండాం గ్రామానికి చెందిన గొల్లూరి వీరాస్వామి, పంచాడి సునీల్ కుమార్ 2013 డిసెంబరు 3న ఆర్టీసీ బస్సులో 20 కిలోల గంజాయి రవాణా చేస్తూ అనంతగిరి పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు న్యాయస్థానంలో చార్జీషీటు దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. లక్ష రూపాయల జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నర సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాలని జడ్జి ఆదేశించారు. ఈ కేసును పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉగ్గిన వెంకటరావు వాదించారు.

రోడ్డు ప్రమాదంలో గుంటపల్లి వాసి మృతి

భీమడోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రెడ్డినగర్ సమీపంలో హైవేపైపై జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామానికి చెందిన గుబ్బ తిరుపతిస్వామి (56), అతని బంధువులు కారులో తిరుపతి వెళ్లారు. శుక్రవారం తిరిగి వస్తుండగా ఏలూరు జిల్లా భీమడోలు మండలం కొండ్రెడ్డినగర్ సమీపంలో ముందు వెళుతున్న ట్రాలీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కారు ఢీ కొంది. దీతో తిరుపతిస్వామికి తీవ్రగాయాలు అయ్యాయి. ఏలూరులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వైసీపీ నుంచి సస్పెన్షన్


గుడబండి ఆదిలక్ష్మి

నర్సీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ ఆదేశాలను ధిక్కరించి, ప్రస్తుతం అధికారంలో వున్న పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నందుకు ఈ చర్యలు తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు నేవీ విన్యాసాలు

... 5వ పేజీ తరువాయి

విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరి 4.40 గంటలకు ఆర్కే బీచ్‌కు చేరుకుంటారు. 6.10 గంటల వరకు నేవీ విన్యాసాలు వీక్షిస్తారు. తిరిగి బీచ్ నుంచి 6.15 గంటలకు బయలుదేరి 6.50 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళతారు.

సీఎం, డిప్యూటీ సీఎం కుటుంబ సభ్యులతో రాక

నేవీ ఆపరేషన్ డెమోకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆయన సతీమణి, పిల్లలు రానున్నారు. ఇంకా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శుక్రవారం రాత్రే నగరానికి చేరుకున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549